తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# వేడుకగా పౌర్ణమి గరుడసేవ



తిరుమల, సెప్టెంబర్ 18ప్రభాతవార్తప్రతినిధి:

పూర్ణిమ సందర్భంగా బుధవారంరాత్రి ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామికి గరుడవాహనసేవ వేడుకగా నిర్వహించారు. సాయంత్రం నిత్యకైంకర్యాలు ముగించుకున్న స్వామివారిని వాహనమండపం వద్ద గరుడవాహనంపై ఆలయ అర్చకులు వేంచేపుచేశారు. అక్కడ వేదమంత్రాలు, కర్పూరహారతులు సమర్పించిన అనంతరం భక్తుల గోవిందనామస్మరణల మధ్య స్వామివారి వాహనం ఊరేగింది. ఆలయ మాఢవీధుల్లో భక్తులు అడుగడుగునా కర్పూర హారతులిచ్చారు. ప్రతినెలా పౌర్ణమిన విశేషాభరణాల అలంకృతుడై మలయప్ప భక్తులకు కటాక్షించడం పరిపాటి. ఈ వాహనసేవలో టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, ఆలయ డిప్యూటీ ఈఓ లోకనాథం, విఎస్ఓలు ఎస్టీవిరామ్‌కుమార్, అల్లంసురేంద్ర, అర్చకులు పాల్గొన్నారు.

# శ్రీ చెంగాళమ్మ దేవస్థానంలో చండీ యాగం

సూళ్లూరుపేట, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవి దేవస్థానంలో చండీయాగాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం ఆవరణలోని యాగ మండపంలో ముందుగా గోపూజ చేసిన అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం చండీ యాగాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం పూర్ణాహుతితో యాగం ముగిసింది. బైరి పార్థసారధి దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఇన్‌ఛార్జ్ ఇఓ శ్రీనివాస బాబు పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరిగింది.

## శ్రీకాళహస్తి గాంధీ

# దేవస్థానం గోదాములో బందీ!

### టెండర్లు పిలిచి ఏడాది అయినా మార్కింగ్ ఇవ్వని ఇంజనీరింగ్ విభాగం



**శ్రీకాళహస్తి రాజకీయ ప్రస్తానమే ప్రత్యేకంగా ఉంటుంది. సుమారు 75 సంవత్సరాల పాటు శ్రీకాళహస్తి ప్రజలకు సుపరిచయస్తుడైన బిక్షాలగాలిగోపురం గాంధీ రెండేళ్ళుగా శ్రీకాళహస్తీశ్వరాలయ దేవస్థానం గోదాములు బందీగా ఉన్నారు.వాహనాల మండపం నిర్మాణానికి అడ్డంకి అని గాంధీ విగ్రహాన్ని అప్పటి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు గాంధీ మండపాన్ని, విగ్రహాన్ని తొలగించారు. నెల లోపల నూతన మండపం కట్టిస్తామని భరోసా ఇచ్చారు.కానీ రెండేళ్ళు గడుస్తున్నా అతీగతి లేదు.గాంధీకి జలియన్ వాలా బాగ్‌లోనే కాదు శ్రీకాళహస్తి దేవస్థానంలో కూడా ఇంజనీరింగ్ విభాగం రూపంలో గాడ్సేలున్నారు. మరో 15రోజుల్లో గాంధీ జయంతి జరగనుంది. మరి గాంధీ ఎక్కడున్నాడంటే గోదాములో బందీగా ఉన్నారు.**

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణంలో స్వాతంత్ర్య సమర యోధులు చలమయ్యశెట్టి తన ఉద్యమ సూర్తితో పట్టణ నడిబొడ్డులోని తేరువీది కూడలిలోని బిక్షాల గాలిగోపురం వద్ద ప్రత్యేకంగా మండపం నిర్మించి అందులో సుమారు ఆరుఅడుగుల విగ్రహాన్ని తయారు చేయించి ప్రతిష్టించారు. 1969లో చలమయ్యశెట్టి ఏర్పాటు చేస్తే ప్రజాస్వామ్యానికి విఘాతం ఏర్పడినపుడు చేసే ఉద్యమాల సందర్భంగా ఈ విగ్రహానికి వినతి పత్రాలు సమర్పించే వారు. శాంతియుత ఆందోళనలు ఇక్కడ నిర్వహించే వారు. అయితే 2022 సంవత్సరం అప్పటి ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు రాజగోపురానికి ముందు స్వామి అమ్మవార్ల వాహనాల మండపం నిర్మాణానికి 'గాంధీ మండపం అడ్డం' అని వెంటనే దానిని తొలగించి ఉత్తరాన ఏర్పాటు చేస్తామంటూ స్థానికులకు భరోసా ఇచ్చి తొలగించారు. నెల లోపల కొత్త మండపం అందులో 'గాంధీ విగ్రహం' ఉంటుందని అరచేతిలో స్వర్గం చూపారు. అయితే ధర్మకర్తల మండలి రెండవ సారి కూడా నియమింపబడింది.2024 జూలై వరకు కొనసాగింది. చైర్మెన్ ప్రజలకిచ్చిన మాట ప్రకారం కొత్త మండపాన్ని ప్రస్తుతం కొత్తగా నిర్మించిన తూర్పు-పడమర (మఠం పక్కన) రోడ్డు పక్కనే ఏర్పాటుకు తీర్మానించారు. రూ.2లక్షలతో టెండర్లు కూడా పిలిచారు. 2023 అక్టోబర్ నెలలో టెండర్లను పిలిచారు. తేజ అనే యువకుడు టెండర్ తీసుకున్నారు.

**మార్కింగ్ చేయని ఇంజనీరింగ్ విభాగం:**

శ్రీకాళహస్తీశ్వరాలయ ఇంజనీరింగ్ విభాగం నిర్లక్ష్యానికి మారుపేరు.ఇక్కడ ఇఇ ఎప్పుడూ అందుబాటులో ఉండరు. డిఇఇ ఏసి కార్యాలయం వదలిపెట్టి బయటకు రారు. ఇక వారి సహాయకులు సరే సరి.గాంధీ మండపం నిర్మాణానికి సంబంధించి ఇంజనీరింగ్ విభాగం 'మార్కింగ్ ' ఇస్తే కాంట్రాక్టర్ రెండు నెలలో పని పూర్తి చేస్తారు.కానీ ఇంజనీరింగ్ శాఖ అధికారుల ఆంతర్యమేమిటో కానీ మార్కింగ్ కోసం కాంట్రాక్టర్ తిరిగితిరిగి విసిగి వేసారారు. ఇక మాజీ చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు కనీసం పది పదిహేను సార్లు అయినా తాను ఇంజనీరింగ్ విభాగంతో చర్చించానని చెబుతున్నారు. టెండర్లు పిలిచి ఏడాది దాటినా ఇంజనీరింగ్ అధికారులు మార్కింగ్ చేయటం లేదంటే ఇంజనీరింగ్ శాఖ పని తీరుకు అద్దం పడుతుంది. ఇటీవల పట్టణ తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షుడు వాకచర్ల గుర్రప్పశెట్టి ఈ సమస్యను శాసనసభ్యుడు సుధీర్‌రెడ్డి దృష్టికి కూడా తెచ్చినట్లు సమాచారం.మరో 15 రోజుల్లో గాంధీ జయంతి రానుంది. కానీ గాంధీ ఎక్కడున్నాడంటే దేవస్థానం ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఎంచక్కా కొత్తగా నిర్మించిన గోదాములో పనికి రాని వస్తువుల మధ్య పడేశారు.ఆ గోదాముకు తాళాలు తగిలించారు.దాంతో పూజ్యబాపూజీ చీకటి గోదాములో కునుకు తీస్తున్నారు.

# మహాపూర్ణాహుతి ....చక్రస్నానం

### వేదోక్తంగా ముగిసిన పద్మావతి పవిత్రోత్సవాలు





తిరుపతి,సెప్టెంబర్ 18ప్రభాతవార్త:

తిరుచానూరులో కొలువైన అమ్మలగన్నఅమ్మ శ్రీనివాసుడి పట్టపురాణి శ్రీపద్మావతిఅమ్మవారి ఆలయంలో మూడురోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు బుధవారం సాయంత్రం మహాపూర్ణాహుతితో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు అమ్మవారి ఆలయంలో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం 3గంటల నుండి 5గంటలవరకు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో అమ్మవారితోబాటు సుదర్శనచక్రత్తాళ్వార్‌కు స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఆ తరువాత చక్రత్వాళ్వార్‌ను పల్లకిపై ఊరేగింపుగా పద్మపుష్కరిణి వద్దకు తీసుకెళ్ళి చక్రస్నానం మహోత్సవం జరిపించారు. ఈ కార్యక్రమంలో టిటిడి ఈఓజె. శ్యామలరావు దంపతులు,జెఈఓ గౌతమి, ఆలయ డిప్యూటీ ఈఓ గోవిందరాజన్, ఎఇఒ రమేష్, ఆలయ అర్చకులు బాబుస్వామి, సూపరింటెండెంట్ శేషగిరి, ఆలయ ఇన్‌స్పెకటర్లు సుభాష్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## తిరుపతి క్రికెట్ విజయ్‌కి

# ఏసిఎల్‌లో కీలక బాధ్యతలు

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ తిరుపతి విజయ్ కుమార్‌కి కీలక బాధ్యతలను అప్పగించింది. 71 సంవత్సరాలలో ఎన్నడూ లేని విధంగా ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రాధాన్యత కల్పించింది. అందులో భాగంగా క్రికెట్ పై ఆసక్తి కలిగి బీసీసీఐ, ఎన్సీఏ, లెవెల్ వన్ కోచ్‌గా క్రికెట్‌కి సేవలఉు అందించిన విజయ్ కుమార్‌కి ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో చోటు కల్పిస్తూ ఏసిఏ స్టేట్ ఇన్ ఫ్రా కమిటీ చైర్మన్, సౌత్ జోన్ అకాడమీస్ కమిటీ కన్వీనర్ పదవులకు ఎంపిక చేస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గురువారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో చిత్తూరు డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేసిన క్రికెట్ విజయ్‌ని అసోసియేషన్ నాయకులు దుశ్యాలువతో ఘనంగా సన్మానించి స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లా క్రికెట్ అసోసియేషన్ పై గత 17 సంవత్సరాలుగా సుధీర్ఘ పోరాటం చేసి విజయం సాధించిన క్రికెట్ విజయ్‌కి ఈ పదవులు దక్కడం నిజంగా ఆనందంగా ఉందన్నారు. జిల్లాలో క్రికెట్‌కు ముందు మంచి భవిష్యత్తు ఉంటుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్క క్రికెటర్‌కు మంచి భవిష్యత్తు అందించాలన్నదే ధ్యేయమని, అందులో భాగంగా జిల్లా క్రికెట్ అభివృద్ధికి అన్ని విధాలా కృషి చేస్తానని ఏసీఏ స్టేట్ ఇన్ ఫ్రా కమిటీ చైర్మన్, ఏసిఏ సౌత్ జోన్ అకాడమీ కమిటీ కన్వీనర్, చిత్తూరు డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ విజయ్ కుమార్ పేర్కొన్నారు. క్రికెట్ క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని క్రికెట్ విజయ్ కోరారు. ఈ సందర్భంగా తనకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్‌లో అవకాశం కల్పించిన ఏసిఏ అధ్యక్షులు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీష్ బాబు, ఉపాధ్యక్షులు ప్రశాంత్, సంయుక్త కార్యదర్శి విష్ణుకుమార్ రాజు, కోశాధికారి దండపాని శ్రీనివాస్, కౌన్సిలర్ విష్ణుతేజాలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు డిస్టిక్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రవి, ఆర్గనైజింగ్ సెక్రటరీ గాలి వేణుగోపాల్ నాయుడు, ఉపాధ్యక్షులు శ్రీనివాసమూర్తి, సంయుక్త కార్యదర్శి సతీష్ యాదవ్, ఈసి మెంబర్లు ప్రకాష్ నాయులు, శివప్రసాద్, టీవీ రమణ, హరికృష్ణలు పాల్గొన్నారు.

# ఒక ఆన్‌లైన్‌లో ఇసుక విక్రయాలు

### - గ్రామ, వార్డు సచివాయాలు, ఇసుక పోర్టల్‌లో బుకింగ్

చిత్తూరు, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:

చిత్తూరులో ఇకపై ఇసుక విక్రయాలు ఆన్‌లైన్‌లో నిర్వర్తించడానికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. జిల్లాలో గురువారం నుండి ఇసుక కోసం ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న వారికి ఇసుక స్టాక్ పాయింట్ల నుండి నేరుగా లబ్దిదారుడి ఇంటి వద్దకే ఇసుక చేర్చడానికి ఏర్పాట్లు చేశారు. గ్రామ, వార్డు సచివాలయాలు, కొత్తగా ఏర్పాటు చేసిన ఇసుక పోర్టల్‌లో లబ్దిదారులు ఇసుక బుక్ చేసుకుంటే ఇసుక బుక్ చేసుకున్న ఒకటి రెండు రోజుల్లో ఇసుక ఇంటికి చేరనుంది. చిత్తూరు జిల్లాలో చిత్తూరు రూరల్ మండలం పాలూరు, దిగువమాసాపల్లి గ్రామాల్లో రెండు ఇసుక స్టాక్ యార్డులను ఏర్పాటు చేశారు. ఇసుక అవసరం అయిన వారు యార్డుల నుండి ఇసుకను గురువారం నుండి బుక్ చేసుకోవచ్చును. ప్రజలు రవాణా ఛార్జీలు చెల్లించి ఇసుకను పొందడానికి ఎపి సాండ్ పోర్టల్‌ను ఏర్పాటు చేసింది. హెచ్‌టిటిపిఎస్:/ / డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.ఎస్ఎఎన్‌డి.ఎపి.జిఓవి.ఐఎన్/ ద్వారా ఇసుక అవసరమైన వారు బుక్ చేసుకోవచ్చును. ఆన్‌లైన్‌లో ఇసుకను బుక్ చేసుకున్న లబ్దిదారులకు ఇసుక బుక్ చేసుకున్న ఒకటి లేదా రెండు పని దినాల్లో ఇంటి వద్దకే ఇసుకను సరఫరా చేయడానికి ఏర్పాట్లు చేశారు. ఇసుక సరఫరా కేంద్రం నుండి లబ్దిదారుడి ఇంటి మధ్య దూరానికి సంబంధించిన రవాణా ఛార్జీలను చెల్లించాల్సివుంటుంది. ఇసుకను సరఫరా చేసే వాహనం తప్పనిసరిగా ఎపి ప్రభుత్వం గనులు, భూగర్భ శాఖలో నమోదై వుండాలి. పని దినాల్లో మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇసుక సాండ్ పోర్టల్‌లో ఇసుకను అర్డర్ చేసుకోవచ్చును. అలాగే లబ్దిదారులు సమీపంలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో ఉదయం 10.30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు ఇసుకను ఆర్డర్ చేసుకోవచ్చును. ఇసుక కొనుగోలు చేసిన లబ్దిదారులు పూర్తి స్థాయిలో ఆన్‌లైన్ చెల్లింపులు చేయాల్సివుంటుంది. ఇసుక యార్డుల్లో ఎవరైనా డబ్బులు అడిగితే ఇవ్వాల్సిన అవసరం లేదు. ఇసుక విధానంపై ఎవరైనా ఫిర్యాదు చేయాలనుకుంటే 08572-299509కు ఫిర్యాదు చేయవచ్చును.

# 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

### నియోజకవర్గ ఇన్చార్జిలకు సూచించిన మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి



వెంకటగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త

2029లో జరగబోయే ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకులకు సూచించారు. తాడేపల్లిలోని జగన్మోహన్ రెడ్డి నివాస గృహంలో జరిగిన నియోజకవర్గ ఇన్చార్జిల సమావేశంలో నేదరుమల్లి రామ్ కుమార్ రెడ్డితో సహా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉండాలని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అందరూ పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు మనోధైర్యం నింపాలని చెప్పారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు విజయుసాయిరెడ్డి, మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మురళీధర్, ఆదాల ప్రభాకర్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, మేకపాటి విక్రమ్ రెడ్డి, ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయునిపై వేటు

రేణిగుంట, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:

రేణిగుంట మండలం మల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుడు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడని జిల్లా విద్యాశాఖ అధికారులు ఆయనపై గురువారం సస్పెన్షన్ వేటు వేశారు. ఉపాధ్యాయుడు విద్యార్థులను పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తున్నాడని విస్తృతంగా ప్రచారం కావడంతో జిల్లా విద్యా శాఖ అధికారి శేఖర్ దిగు స్థాయి అధికారులను విచారణకు ఆదేశించారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ బాలాజీ, ఎంఈవో ఇందిరాదేవి విద్యార్థినులను విచారించారు. ప్రాథమిక దర్యాప్తు అనంతరం సదరు ఉపాధ్యాయుని సస్పెండ్ చేస్తున్నట్లు డిప్యూటీ డీఈవో బాలాజీ ప్రభాతవార్తకు తెలిపారు. సమగ్రమైన విచారణ జరిపి నిజ నిర్ధారణ చేస్తామన్నారు. ఈ విషయమై ఉపాధ్యాయుడు మాట్లాడుతూ తాను ఎవరితోను అసభ్యంగా ప్రవర్తించలేదని అన్నారు. తన సర్వీసులో ఇంత వరకు ఎలాంటి రిమార్కులు లేవన్నారు. కొంత మందితనపై పని కట్టుకుని బురద చల్లారన్నారు. ఎలాంటి విచారణకైనా తాను సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

# రావణబ్రహ్మ వాహనంపై విహరించిన శివపుత్రుడు

కాణిపాకం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం రాత్రి ఉభయదేవేరులతో పార్వతీతనయుడు రావణబ్రహ్మ వాహనంపై కాణిపాకం పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయహస్తమిచ్చాడు. ఆలయంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాల ప్రత్యేక ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు స్వామివారికి రావణబ్రహ్మ వాహనసేవను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి పుణ్యసముద్రం, లక్ష్మాంబపురం, సంతపల్లె, ద్వారకాపురం, కురప్పల్లె, సిద్దంపల్లె గ్రామస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. వీరు ఉదయం వరుస ఉభయం తీసుకురాగా అర్చకస్వాములు స్వామివారి మూలవిరాట్‌కు వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక అభిషేకాలను, పూజలను నిర్వహించి భక్తులకు దర్శనం కల్పిం చారు. అలాగే రాత్రి సిద్ధి, బుద్ధి సమేతుడైన గణనాథుని ఉత్సవ మూర్తులను అన్వేటి మండపంలో వుంచి శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించి ధూపదీపనైవేద్యాలను సమర్పించారు. అనంతరం రంగురంగుల విద్యు ద్దీపాలు, వివిధ రకాల పరిమళ పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన రావణబ్రహ్మ వాహనంపై ఉభయదేవేరులతో స్వామివారు అధిరోహించి మంగళవాయిద్యాల నడుమ కాణిపాకం గ్రామ పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు అభయహస్తం అందించారు. ఈసందర్భంగా భక్తులు నారికేళ సమర్పణలతో మొక్కులను తీర్చుకున్నారు.ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి,సూపరెండెంట్‌లు శ్రీధర్‌బాబు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు విఘ్నేష్, రవి, స్థానిక సర్పంచ్ శాంతిసాగర్‌రెడ్డి, ఎంపీటీసీ సుధీర్,ఆలయ మాజీ ఛైర్మన్ మణినాయుడు, మాజీ సర్పంచ్ మధుసూధన్ రావులతో పాటు ఆలయ, ఉత్సవ ఉభయదారులు, భక్తులు పాల్గొన్నారు.

# మళ్లీ చంద్రుని పైకి వెలుతున్నాం

### ఈ సారి తిరిగి భూమికి వస్తున్నాం- చంద్రయాన్-4 ప్రాజెక్టుకు కేంద్ర కేబినెట్ ఆమోదం

### - మొత్తం నాలుగు ఇస్రో ప్రాజెక్టులకు సిద్ధం

శ్రీహరికోట (తడ), సెప్టెంబర్ 18 ప్రభాతవార్త

అంతరిక్ష పరిశోధనలో భారత్ మరో భారీ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టనుంది. బుధవారం కేంద్ర కేబినెట్ ఈ మేరకు ఆమోదం తెలిపింది. ఇప్పటిదాకా శ్రీహరికోట నుంచి మూడుసార్లు చంద్రయాన్‌లను ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలు నాలుగవ ప్రాజెక్టు చేపట్టడానికి కేంద్రప్రభుత్వం ఆమోదించింది. శాస్త్రవేత్తలు సైతం ఇప్పటికే ఈ దిశలో అడుగులు వేస్తున్నారు. బుధవారం కేంద్రప్రభుత్వం ప్రకటించిన మేరకు చంద్రయాన్-4 చంద్రునిపై వెళ్లడమే కాకుండా భూమికి తిరిగి రావడానికి, అక్కడి నమూనాలను తీసుకురావడానికి తద్వారా తన సాంకేతికతను ప్రపంచానికి ప్రదర్శించడానికి ఈ ప్రయోగం విజయవంతం కావాల్సి ఉంది. ప్రధానమంత్రి నరేంద్రమోడీ అధ్యక్షతన జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో 2040 నాటికి చంద్రునిపై చంద్రయాన్-4 దిగనుంది. అక్కడ నుంచి సాంకేతిక సామర్థ్యాలను సాధించి సురక్షితంగా తిరిగి భూమికి వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. డాకింగ్/అన్‌డాకింగ్, ల్యాండింగ్, భూమికి సురక్షితంగా తిరిగి రావడానికి చంద్ర నమూనా సేకరణ కోసం శాస్త్రవేత్తలు విశ్లేషించేందుకు కూడా ఈ సాంకేతిక వ్యవస్థ ఉపయోగపడుతుంది. 2035 నాటికి అంతరిక్షంలో భారతీయ అంతరిక్ష్ స్టేషన్, చంద్రునిపై 2040 నాటికి భారత ల్యాండింగ్‌ను ఊహించి అమృత్‌కాల్ సమయంలో భారత అంతరిక్ష కార్యక్రమం కోసం ప్రభుత్వం విస్తృత దృష్టిని ఈ సమావేశంలో వివరించింది. సంబంధిత అంతరిక్ష రవాణా మరియు మౌలిక సదుపాయాల సామర్థ్యాల అభివృద్ధితో సహా చంద్రయాన్ ఫాలో ఆన్ మిషన్లు ఊహించబడ్డాయి. చంద్రుని ఉపరితలంపై చంద్రయాన్-3లోని ల్యాండర్ సురక్షితమైన మరియు మృదువైన ల్యాండింగ్ విజయవంతంగా ప్రదర్శన వల్ల ఇప్పటికే కీలకమైన సాంకేతికతలను నిరూపించుకోగలిగిన మన దేశం కొన్ని ఇతర దేశాలు మాత్రమే కలిగి ఉన్న సామర్థ్యాలను ప్రదర్శించడానికి ఈ చంద్రయాన్-4ను ఉపయోగించుకోనుంది. సాంకేతిక ప్రదర్శన కోసం చేపడుతున్న చంద్రయాన్-4 ప్రాజెక్టుకు 2104.06 కోట్లు అవసరమవుతాయని కేబినెట్ పేర్కొంది. వ్యోమనౌక అభివృద్ధి, ఎల్‌విఎం-3లోని రెండు ప్రయోగ వాహనాల మిషన్లు, బాహ్య డీప్ స్పేస్ నెట్‌వర్క్ మద్దతు మరియు డిజైన్ ధ్రువీకరణ కోసం ప్రత్యేక పరీక్షలు నిర్వహించడం



కూడా ఈ ప్రయోగ ఏర్పాట్లలో ముఖ్యమైనవి. ఇందుకోసం భారతీయ పరిశ్రమల యొక్క గణనీయమైన సేవలు అందుకునే అవకాశాన్ని కూడా ప్రస్తావిస్తున్నారు. ఈ ప్రధాన ప్రాజెక్టులు నిర్ధారణ కాగానే అటు ఇస్రో శాస్త్రవేత్తలు, ఇటు షార్ శాస్త్రవేత్తలు, అధికారుల్లో కూడా మరోసారి తమ సత్తా చాటుకునే అవకాశం దొరికిందని పలువురు అంటున్నారు.

# ప్రోటోకాల్ ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త




తిరుపతి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రా లు తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి, శ్రీకాళహస్తీశ్వర స్వామి, జ్ఞాన ప్రసూనాంబ తదితరాలు ఉన్నాయని, అలాగే పలు జాతీయ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌లు జరుగుతుంటాయని, పలు పర్యాటక ప్రదేశాలు తదితరాలు ఉన్న నేపథ్యంలో పలువురు కేంద్ర, రాష్ట్ర మంత్రులు, జడ్జిలు, కేంద్ర రాష్ట్ర ఉన్నతాధికారులు తదితర ప్రముఖుల పర్యటనలు ఎక్కువగా ఉంటున్నాయని ప్రోటోకాల్ ఏర్పాట్లు పక్కాగా ఉండాల్సి ఉంటుందని అధికారులు సమన్వయంతో పని చేసి ఎలాంటి లోటుపాట్లు వివాదాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో రెవెన్యూ, పోలీస్, ఎయిర్పోర్ట్, టెంపుల్ తదితర సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ జెసి శుభం బన్సల్, ఎస్పి సుబ్బరాయుడులతో కలసి సంబంధిత అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విమానాశ్రయ అధికారుల తగినన్ని పాస్‌లు కలెక్టరేట్ నుండి తెలిపిన వివరాల మేరకు తప్పకుండా సకాలంలో ఇవ్వాలని, సిఐఎస్ఎఫ్ అధాకారులు తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఎస్పి మాట్లాడుతూ ప్రముఖులకు భద్రత స్కేల్ ప్రకారం సెక్యూరిటీ ఏర్పాటు చేయడం జరుగుతుందని, పోలీస్ సిబ్బందికి వసతి ఏర్పాటుకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పి వెంకట్రావు, రవి మనోహరాచారి, శ్రీనివాస రావు, ఆర్డీఓ తిరుపతి నిశాంత్ రెడ్డి, ఆర్డీఓ శ్రీకాళహస్తి రవి శంకర్ రెడ్డి, ఎయిర్పోర్ట్ డైరెక్టర్ శ్రీనివాస రావు, రుయా ఆసుపత్రి సూపరింటెండెంట్ రవి ప్రభు, టిటిడి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, పోలీస్ ఉన్నతాధికారులు, రెవెన్యూ తదితర అధికారులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మొక్కలతోనే జీవుల మనుగడ



**చిత్తూరు, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** మొక్కలతోనే మానవులు, ఇతర జీవుల మనుగడ సాధ్యమవుతుందని అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్ అన్నారు. కమీషనర్ నరసింహప్రసాద్ ఆదేశాల మేరకు అసిస్టెంట్ కమీషనర్ ఎ.ప్రసాద్ బుధవారం స్వచ్ఛత హీ సేవ-2024 కార్యక్రమంలో భాగంగా కొంగారెడ్డిపల్లి పూల మార్కెట్ వద్ద చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది పూలమార్కెట్ పరిసరాల్లో ఖాళీగా వున్న స్థలంను శుభ్రం చేసి మొక్కలు నాటారు. అసిస్టెంట్ కమీషనర్ మాట్లాడుతూ పర్యావరణ, పరిశుభ్రత, పచ్చదనం పెంపొందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. విరివిగా మొక్కలు నాటి వాటిని పెద్ద చేయడం ద్వారా భావి తరాలకు నాణ్యమైన ఆక్సిజన్ అందించవచ్చునన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాల్లో భాగంగా నగర పాలక సంస్థ పరిధిలోని డంపింగ్ యార్డు, వార్డు సచివాలయాల వద్ద మొక్కలు నాటారు. పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు నగరంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాలను చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్‌నాయక్, ఆర్ఓ గోపాలకృష్ణ వర్మ, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు లోకనాథం, నరసింహం, స్థానిక ప్రముఖులు, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఎస్ఐ సుమన్‌కు ఆత్మీయ సన్మానం

**శ్రీరంగరాజపురం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:**



ఎస్ఆర్ పురం ఎస్ఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన సుమన్‌కు మాజీ వాటర్‌షెడ్ ఛైర్మన్, రైతు నాయకులు గుణశేఖర్‌నాయుడు బుధవారం ఆత్మీయంగా సన్మానించారు. ఎస్ఆర్ పురం మండలంలో శాంతి భద్రతల పరిరక్షణకు పక్కాగా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గుణశేఖర్‌నాయుడు ఎస్ఐను కోరారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**గుడిపాల, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:**



ప్రస్తుత పరిస్థితుల్లో పర్యావరణ పరిరక్షణ అనేది ప్రతి ఒక్కరి బాధ్యతగా మారిందని ఎంపిడిఓ ఉపేంద్ర పేర్కొన్నారు. స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఎంపిడిఓ ఉపేంద్ర 189 కొత్తపల్లి గ్రామ సచివాలయం ఆవరణలో చెట్లు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఎక్కడ స్థలం వుంటే అక్కడ చెట్లు నాటి వాటిని సంరక్షించే బాధ్యతలను తీసుకోవాలని పిలుపునిచ్చారు. పర్యావరణంను కాపాడుకోవవాలని లేదంటే ప్రపంచంలో జీవకోటికి ప్రమాదం అన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## పిఎం విశ్వకర్మ యోజన సద్వినియోగం

**పాలసముద్రం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:**



ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన పథకంను అర్హులైన ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ముందడుగు వేయాలని ఎంపిడిఓ రామనాథరెడ్డి పేర్కొన్నారు. ఎంపిడిఓ కార్యాలయంలో బుధవారం మాట్లాడుతూ విశ్వకర్మ, దోభీ, నాయిబ్రహ్మణ, కుమ్మరి, శిల్పులు, స్వర్ణకారులు, వడ్డెర, ఉప్పరి, మేర, మేదరి తదితర చేతి వృత్తులవారు, కళాకారులకు పరికరాల కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా ఆర్థిక సహకారం అందిస్తుందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికేట్‌తో పాటు గుర్తింపు కార్డు, ట్రైనింగ్ టూల్ కిట్ల కొనుగోలుకు రూ.15 వేలు ఆర్థిక సహాయం చేస్తారన్నారు. ఈ పథకం కింద లబ్దిదారులకు 5 శాతం వడ్డీతో రూ.3 లక్షల వరకు రుణం రెండు విడతలుగా మంజూరు చేయడం జరుగుతుందన్నారు. దరఖాస్తుదారులు గ్రామ సచివాలయం లేదా కామన్ సర్వీస్ సెంటర్ ద్వారా ఆధార్, రేషన్‌కార్డు, మొబైల్ నెంబర్, పాన్ కార్డు, బ్యాంకు వివరాలు సమర్పించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవడానికి 18 సంవత్సరాలు నిండిన యువతీయువకులు అర్హులన్నారు.

## కుప్పంనుంచి తిరుమలకు నూతన ఆర్టీసీ బస్సు ప్రారంభం

**కుప్పం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** కుప్పం పట్టణం నుంచి తిరుమలకు నూతన ఆర్టీసీ బస్సును కుప్పం తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం బుధవారం స్థానిక డిపో ప్రాంగణంలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైకాపా పాలనలో కుప్పం డిపోలోని బస్సులు చాలావరకు పుంగనూరు, ఇతర డిపోలకు తరలించారన్నారు. చంద్రబాబునాయుడు మరలా సిఎం కాగానే ఇతర ప్రాంతాలకు తరలించిన బస్సులతో పాటు నూతన బస్సులను డిపోకు తెప్పించడం జరుగుతోందన్నారు. ప్రజలకు అవసరమైన మార్గాల్లో ఆర్టీసీ సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.అనంతరం మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్‌ను బస్సును కొంత దూరం నడిపారు.

## కాణిపాకం ఆలయంలో కొనసాగుతున్న స్వచ్ఛత హీ సేవ

**కాణిపాకం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:**



కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో రెండోరోజు బుధవారం స్వచ్ఛత హీ సేవ కార్యక్రమం నిర్వహించారు. కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల ఆదేశాల మేరకు ఈనెల 17 నుండి గాంధీజయంతి అక్టోబర్ 2 వరకు స్వచ్ఛత హీ సేవ నిర్వహించాలన్న ఆదేశాల మేరకు ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్ ఆధ్వర్యంలో ఈకార్యక్రమంను నిర్వహిస్తున్నారు .ఇందులో భాగంగా రెండో రోజు బుధవారం ఈసందర్భంగా కాణిపాకం దేవస్థానం ప్రాంగణంలోని శ్రీగణేష్ సదన్ పరిసర ప్రాంతాలను శుభ్రం చేశారు. అక్కడ వున్న చెత్తాచెదారంను సిబ్బంది తొలగించి బయటకు తరలించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఏఈఓలు ఎసీ .కృష్ణారెడ్డి, ధనుంజయ, సూపరెండెంట్‌లు మల్లికార్జున, శానిటేషన్ సిబ్బంది, అర్చకులు పాల్గొన్నారు.

## అర్ధగిరిలో వైభవంగా శ్రావణిపౌర్ణమి వేడుకలు

**తవణంపల్లె, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:**



ప్రముఖ పుణ్యక్షేత్రమైన అరగొండ అర్ధగిరి శ్రీవీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం పౌర్ణమి వేడుకలు అత్యంత ఘనంగా జరిగాయి. ప్రతి నెలా ఆలయంలో పౌర్ణమి వేడుకలు నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ఆలయ ఈఓ టి.హనుమంతురావు ఆధ్వర్యంలో ఈవేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలో ప్రధాన అర్చకులు ఉదయం స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకం, పూజలు నిర్వహించి ధూప దీప నైవేద్యాలను సమర్పించి భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే అర్చకులు ఉదయం 11 గంటలకు ఆలయ మండపంలో సుదర్శనహోమం, ఆకుపూజ, వడమాలసేవ, మధ్యాహ్నం సహస్రనామార్చన, ఆకుపూజ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి ప్రాకారోత్సవంను ఘనంగా నిర్వహించారు. ఈమేరకు అలంకరించిన స్వామివారిని ప్రత్యేక పల్లకిపై వుంచి ఆలయం, సంజీవరాయని పుష్కరిని చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. ఈసందర్భంగా భక్తుల కాలక్షేపం నిమిత్తం పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## వరద బాధితులకు రూ. 10వేలు విరాళం

**చౌడేపల్లి, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**



విజయవాడ వరద బాధితులకు లద్దిగం అంబేద్కర్ సేవా సమితి రూ. 10వేల ఆర్థికసాయం చేసింది. ఈమేరకు స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో సమితి సభ్యులు మునస్వామి, మనోజ్, సురేష్, మణిలు డిటి మాధవికి చెక్కునందించారు. లద్దిగం అంబేద్కర్ సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## శక్తిక్షేత్రంలో చండీహోమం

**బోయకొండ(చౌడేపల్లి), సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**



శక్తిక్షేత్రం బోయకొండ గంగమ్మ ఆలయంలో శాస్త్రోక్తంగా చండీహోమం జరిగింది. పౌర్ణమిన హోమం చేయడం వల్ల లోకం సుభిక్షింగా వుంటుందని పండితులంటున్నారు. ఈమేరకు ఉదయాన్నే అమ్మవారి ఆలయ సముదాయంలోని వేదమండపంలో హోమాన్ని కన్నుల పండుగలా నిర్వహించారు. వేద పండితుడు గోవర్ధనశర్మ ఆధ్వర్యంలో దంపతులు సమక్షాన జరిగిన చండీహోమంతో కొండ దద్దరిల్లింది. ఆలయ ఇఓ, ఉపకమీషనర్ ఏకాంబరం భక్తులకు పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు. అధికార, సిబ్బంది సేవలు చేసారు.

## అత్తిగారిగుట్టపై ఘనంగా పౌర్ణమి పూజలు

**గుడిపాల, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:**



మండల పరిధిలోని 197 రామాపురం సమీపంలోని అత్తిగారిగుట్టపై వెలసిన శివాలయంలో బుధవారం పౌర్ణమి పురస్కరించుకుని ఘనంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శివలింగంను విశేషాలంకరణ చేసి దూప దీప నైవేధ్యాలతో హారతులు ఇచ్చారు. అనంతరం స్వామి వారిని దర్శించుకోవడానికి వచ్చిన భక్తులకు అన్నదానం, స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రెండు రోజుల క్రితం అత్తిగారిగుట్ట మీద నూతన హనుమంతుని విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై స్వామి వారిని దర్శించుకున్నారు.

## ఓటరు జాబితా ఇంటింటి సర్వే వంద శాతం పూర్తి

**– ఆర్డీఓ చిన్నయ్య**



**చిత్తూరు, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** స్పెషల్ సమ్మరి రివిజన్-2025 కార్యక్రమంలో భాగంగా ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను వంద శాతం పూర్తి చేయాలని చిత్తూరు ఆర్డీఓ చిన్నయ్య ఎన్నికల సూపర్‌వైజర్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఆర్డీఓ చిన్నయ్య, మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్‌లు బుధవారం ఎన్నికల సూపర్‌వైజరీ అధికారులతో స్పెషల్ సమ్మరి రివిజన్-2025పై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్డీఓ చిన్నయ్య మాట్లాడుతూ ప్రీ రివిజన్ కార్యక్రమాల్లో భాగంగా ఓటర్ల జాబితా ఇంటింటి సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలన్నారు. ప్రధానంగా ఒక కుటుబంలోని సభ్యుల పేర్లన్ని ఒకే చోట వుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇంటి నెంబర్లలో పొరబాట్లు వుంటే గుర్తించాలని, ఓటర్ల పేర్లు, చిరునామాలు తప్పులు వుంటే గుర్తించాలని, మృతి చెందిన, ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతంకు తరలి వెళ్ళిన ఓటర్లను గుర్తించాలన్నారు. ఎన్నికల విధులను అత్యంత ప్రాధాన్యత ఇచ్చి పూర్తి చేయాలన్నారు. బిఎల్ఓలను సమన్వయం చేసుకుని సకాలంలో దరఖాస్తులను పూర్తి చేయాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, ఎన్నికల విభాగం అధికారులు, సూపర్‌వైజర్ అధికారులు పాల్గొన్నారు.

## పాకాలలో చిరు వస్త్ర వ్యాపారులపై ఆంక్షలు సరికాదు

**పాకాల, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**

పాకాల మండల కేంద్రంలో గత కొంత కాలంగా రెడీమేడ్ వ్యాపార నిమిత్తం బయట ప్రాంతాల నుంచి కొంతమంది వ్యాపారస్తులు పండుగలు, తిరునాళ్ళ సమయంలో టౌన్ పరిధిలో కొన్ని ప్రాంతాలలో తాత్కాలిక బర్మాబజార్, చైనా బజార్ లాంటి షాప్ ఏర్పాటు చేసి జీఎస్టీ పై వ్యాపారం సాగిస్తూ వస్తున్నారు. కానీ ఇప్పుడు కొంత కాలంగా మాత్రం స్థానికంగా ఉన్న కొంత మంది టెక్స్‌టైల్, రెడీమేడ్ షాప్ యాజమాన్యం నుంచి వీరు ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని తీవ్ర ఆంక్షలు ఎదుర్కొంటున్నారు. మీరు వస్తే మా వ్యాపారాలు తగ్గిపోతాయని, మిమ్మల్ని రానియకుండా ఉండే మాకు స్థానికంగా వ్యాపారాలు బాగుంటాయని తమను ఆపే ప్రయత్నాలు చేస్తున్నారని చిరువ్యాపారం నుంచి వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. జిఎస్టి పై ఫ్రీ ట్రేడ్ పాలసీ విధానం ద్వారా ఏ పట్టణంలో అయినా వ్యాపారం చేయుటకు అనుమతి తీసుకున్న తరుణంలో స్థానిక వ్యాపారులు ఆంక్షలు విధించడం సరికాదని అటు చిరువ్యాపారులు వినియోగదారులు అంటున్నారు. తమకు ఎక్కడ నాణ్యమైన వస్త్రాలు తక్కువ ధరకు లభిస్తే వారి వద్ద నుంచే తాము కొనుగోలు చేస్తామని బయట ఊరి వ్యాపారులపై ఆంక్షలు తగవని ఆరోగ్యకరమైన వాతావరణంలో అందరూ వ్యాపారాలు సాగించాలని వినియోగదారులు కోరుతున్నారు.

## మంత్రి రాంప్రసాద్‌ను కలసిన చల్లాబాబు

**పుంగనూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త :**



రాష్ట్ర రవాణా,యువజన క్రీడాశాఖల మంత్రి రాంప్రసాద్‌రెడ్డిని పుంగనూరు దేశం ఇన్‌చార్జి చల్లాబాబు బుధవారం ఉదయం మంత్రి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. పుంగనూరు నియోజక వర్గంలో చేపట్టాల్సిన అభివృద్ది కార క్రమాలతో పాటూ పార్టీ వ్యవహారాలపై మంత్రితో చర్చించినట్లు తెలిసింది. నియోజకవర్గ వ్యాప్తంగా త్వరలో మంత్రి పర్యటనకు కార్యాచరణ సిద్దం చేయడానికి చర్చలు జరిగినట్లు తెలిసింది.

## వరదబాధితులకు రూ 1.50లక్షల విరాళం

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**



విజయవాడ వరద బాధితులను ఆదుకునేందుకు అస్టర్ హాస్పిటల్ డైరెక్టరు ప్రవీణ్, కుమార్‌లు ముందుకు వచ్చారు. వీరు వరద బాధితులకు తమవంతుసాయంగా రూ 1.60లక్షల చెక్కును తెదేపా సలహాదారు నరేష్‌వారికి అందజేశారు.నేతలు ఈశ్వర్, సతీష్ పాల్గొన్నారు.

## వానగుట్టపల్లిలో నూతన సిసి రోడ్ల నిర్మాణం

**కుప్పంరూరల్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** మండలంలోని పంచాయతీ కేంద్రం వానగుట్టపల్లిలో నూతన సిమెంట్ రోడ్ల నిర్మాణ పనులకు మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, నేతలు శివకుమార్, స్వాతి రాజగోపాల్, రామచంద్ర, మహేంద్ర తదితరులు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్ల నాణ్యత విషయంలో రాజీ పడేది లేదన్నారు. ప్రజల సౌకర్యార్థం నిర్మిస్తున్న నూతన రోడ్డులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. విడతల వారీగా పంచాయతీలో రోడ్ల నిర్మాణాలు చేపడ్తామన్నారు. నేతలు రామచంద్ర, రఘు, శ్రీనివాసులు, పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలి

**దక్కిలి,ఆగష్టు 18,ప్రభాతవార్తః**



విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలని డక్కిలి ఎంపీపీ గోను రాజశేఖర్ తెలిపారు.డక్కిలి గురుకులం క్రీడాప్రాంగనంలో బుధవారం మండల స్థాయి స్కూల్ గేమ్స్ జరిగాయి. ఈపోటీల్లో మండలంలోని పలు స్కూల్స్‌కు చెందిన విద్యా ర్థులు పాల్గొన్నారు.ఈసందర్భంగాఆయన మాట్లాడుతూ క్రీడా స్ఫూర్తితో క్రీడల్లో పాల్గొని విజేతలుగా నిలవాల్నారు.గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడా పోటీల్లోరాణించే విదంగా విద్యార్థులను వ్యాయామ ఉపాద్యాయులు వారిని తీర్చిదిద్దాలన్నారు.పలు క్రీడా అంశాల్లోవిజేతులుగా నిలిచిన విద్యార్థు లకుబహుమతులు అందజేశారు. ఎంపీడీవో ప్రసన్నకుమారి,ఎంఈఓ జగదీష్‌బాబు, గురుకుల పాఠశాల విద్యాకమిటీ చేర్మన్ రత్నం,డక్కిలి ఉన్నత పాఠశాల విద్యాకమిటీ చేర్మన్ వెంకట రమణారెడ్డి,పలువురు వ్యాయామ ఉపాద్యాయులు పాల్గోన్నారు

## శ్రీచెంగాళమ్మ దేవస్థానంలో చండీ యాగం

**సూళ్లూరుపేట, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**



సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరిదేవి దేవస్థానంలో చండీయాగాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దేవస్థానం ఆవరణలోని యాగ మండపంలో ముందుగా గోపూజ చేసిన అనంతరం వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఉదయం చండీ యాగాన్ని ప్రారంభించారు. మధ్యాహ్నం పూర్ణాహు తితో యాగం ముగిసింది. భైరి పార్థసారధి దంప తులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. ఇన్‌ఛార్జ్ ఇఓ శ్రీనివాస బాబు పర్యవేక్షణలో జరిగింది.

## ఆలిండియా ట్రెక్కింగ్ శిబిరంలో ఎన్‌బికెఆర్ విద్యార్థిని ప్రతిభ

**కోట, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**



కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో బిటెక్ తృతీయ సంవత్సరం ఎఐ అండ్ డిఎస్ విభాగంలో చదువుతున్న పిండి గాయత్రి అనే విద్యార్థిని ఎన్‌సిసి నావల్ వింగ్‌లో నేషనల్ క్యాంప్ అయిన ఆలిండియా ట్రెక్కింగ్ ఎక్స్‌పిడిషణ్ క్యాంప్‌కి ఎంపికైంది. అందులో భాగమైన కల్చరల్ కార్యక్రమంలో తన ప్రతిభ చూపిందని కళాశాల నావెల్ ఎన్‌సిసి అధికారి డాక్టర్ వి.మల్లికార్జునరెడ్డి తెలిపారు. పిండి గాయత్రిని కళాశాల కరస్పాండెంట్ నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి, ఎఐ అండ్ డిఎస్ విభాగాధిపతి డాక్టర్ ఎ.నారాయణరావు, అన్ని విభాగాధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. ఈ కార్యక్రమంలో అన్ని విభాగాధిపతులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్ రావు జన్మదిన వేడుకలు



**గూడూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**

గూడూరు పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్‌లో గూడూరు మాజీ ఎమ్మెల్యే వరప్రసాదరావు పుట్టిన రోజు వేడుకలు ఆయన అనుచరులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గూడూరు పాత బస్టాండ్ సెంటర్ వద్ద గూడూరు మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్ రావు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. అనంతరం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో రోగులకు పండ్లు, పాలు అందజేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు మాజీ ఎమ్మెల్యే వరప్రసాద్ రావు మాట్లాడుతూ స్వతంత్రంగా ఆలోచించే వారికి వైసిపిలో స్థానం ఉండదని అందుకు తానే ఉదాహరణ అని పేర్కొన్నారు. తనను ఆదరిస్తున్న బిజెపి నాయకత్వానికి స్థానిక నాయకులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. గూడూరు నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు పురుషోత్తం రెడ్డి, బాలకృష్ణ నాయుడు, ప్రకాష్ నాయుడు, వినీష్ తదితరులు పాల్గొన్నారు.

## కర్ణాటక మద్యం స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

**పెద్దపంజాణి, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** మండలంలోని రాజుపల్లి చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా ఓ వ్యక్తి కర్ణాటక మద్యంతో పట్టుబడినట్లు ఎస్సై సహదేవి తెలిపారు. కొళత్తూరు పంచాయతీ గల్లవారిపల్లికి చెందిన శ్రీరాములు అనే వ్యక్తి తన టువీలర్‌లో 1008 కర్ణాటక మద్యం టెట్రా ప్యాకెట్లు తరలిస్తూ పట్టుబడ్డాడన్నారు. మద్యం, టువీలర్‌ను సీజ్ చేసి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

## ఆటో యూనియన్ ద్వారా ఆర్థిక సాయం

**గూడూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని బనిగిసాహెబ్ పేటలో నివాసం ఉంటున్న ఆటో డ్రైవర్ మున్నా ఇటీవల అనారోగ్యానికి గురై, నడవలేని స్థితిలో ఇంటి వద్దనే ఉన్నారు. సాటి ఆటో కార్మికులు అందరూ కలిసి ఐదువేల రెండు వందల రూపాయలను మున్నాకి అందజేశారు. ఈ సందర్భంగా ఆటో యూనియన్ నాయకులు మాట్లాడుతూ దాతలు, స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి మున్నాకి ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షులు బివి రమణయ్య, గూడూరు రైల్వే స్టేషన్ సిఐటియు ఆటో స్టాండ్ నాయకులుఎస్కెమున్నా,ఆర్.లక్ష్మణ్,ఆర్.రఘు,ఎస్.శేఖరయ్య,ఎస్కె హాషిమ్, ఎం. బాలు పాల్గొన్నారు.

## అంగన్‌వాడి కేంద్రాల్లో పోషకాహార మాసోత్సవాలు

**గూడూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



గూడూరు పట్టణంలోని విఘ్నేశ్వర పురం, కుమ్మరి వీధి సెక్టార్ పరిధిలో ఉన్న అంగన్‌వాడి కేంద్రంలో పోషకాహార మాసోత్సవాలు ఘనంగా నిర్వహించారు. పాల్గొన్న సిడిపిఓ మెహబూబీ మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలకు బలవర్ధకమైన పోషకాహారం అందించాలని సూచించారు.సూపర్‌వైజర్ చెంచులక్ష్మి, అంగన్‌వాడికార్యకర్త చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు

## వరద బాధితుల సహాయార్థం ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు విరాళం అందజేత

**గూడూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



వరద బాధితుల సహాయార్థం గూడూరు పట్టణానికి చెందిన సాయి పదివేల రూపాయిలు, చిల్లకూరు మండలం ఎగురు రాజుపాలెం గ్రామానికి చెందిన శివశంకర్ రాజు 5000 రూపాయిలు సిఎం సహాయ నిధికి విరాళాలు అందజేయడం అభినందనీయమని గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ అన్నారు. తిరుపతి జిల్లా గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే నివాసం వద్ద సాయి, శివశంకర్ రాజులు విరాళం చెక్కులను ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు అందజేశారు. గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం సిఎం సహాయ నిధికి రెండవ విడత ఇప్పటి వరకు అందిన 8 లక్షల రూపాయిలు విరాళాలను విజయవాడలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ బాబుకు అందజేసేందుకు విజయవాడకు వెళుతున్నట్లు తెలిపారు. ఎవరైనా విరాళాలు అందజేయాలనుకుంటే నేరుగా సిఎం సహాయనిధి అకౌంట్‌కు పంపాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## బూదనం పంచాయితీలో స్వచ్ఛత హి సేవ కార్యక్రమం

**చిల్లకూరు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



చిల్లకూరు మండలంలోని బూదనం గ్రామ పంచాయితీ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో భాగంగా బుధవారం చేయాల్సిన ముందుగా పనులు గుర్తించినటువంటి చెత్త దిబ్బను తొలగించారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, ప్రజాప్రతినిధులు, డివిజనల్ పంచాయితీ అధికారి గూడూరు, చిల్లకూరు మండలం విస్తరణ అధికారి, పంచాయితీ కార్యదర్శి, పొదుపు సంఘం సభ్యులు ఆధ్వర్యంలో నిర్వహించారు.పిఓపిఆర్డిఓ దాసరి రాజమాణిక్యం, పంచాయితీ కార్యదర్శి సుబ్రమణ్యం, గ్రామస్తులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సాగర్.. సురక్షిత సాగర్

**వాకాడు, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



వాకాడు మండలం తూపిలి పాలెంలో ఈ నెల 21వ తేదీ అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవం సందర్భంగా స్వచ్ఛ సాగర్ – సురక్షిత సాగర్ కార్యక్రమం జరుగుతుందని మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వాటంగారి వవెంకటరమణయ్య తెలిపారు. బుధవారం వాకాడు మండల తహశీల్దార్ రామయ్యకు, ఎంపిడివో మనోహర్ గౌడ్, మర్యాదపూర్వకంగా వినతి పత్రం అందజేసి కార్యక్రమంకు హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులతో వెంకటరమణయ్య మాట్లాడుతూ మత్స్యకార సంక్షేమ సమితి ఇన్ కాయిస్ సంస్థ ఆధ్వర్యంలో తూపిలిపాలెంలో స్వచ్ఛ సాగర్ – సురక్షిత సాగర్ కార్యక్రమంను సంకల్పించి బీచ్‌లో ఉన్న చెత్త, ప్లాస్టిక్ పర్యావరణ హానికరమైన ఇతర పదార్థాలను ఏరి వేసి కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంకు జిల్లా స్థాయి అధికారులు, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మత్స్యకార విద్యా కమిటీ సెక్రెటరీ లక్ష్మణరావు, కొండూరు చిన్న వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

**వెంకటగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



పట్టణంలని బంగారుపేట వద్ద తెలుగు గంగ వంతెన సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. స్కూటీని నెల్లూరు వైపుకు వెళ్తున్న ఆర్టీసి బస్సు ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. స్కూటీలో వెంకటగిరికి వస్తున్న అలహరి దుర్గాప్రసాద్ స్వల్పంగా గాయపడగా, తల్లి రాజేశ్వరి తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడ ప్రాథమిక చికిత్స అనంతరం రాజేశ్వరి పరిస్థితి విషమంగా ఉండడంతో 108 వాహనంలో తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. ఇంత ప్రమాదం జరిగిన ఆర్టీసి డ్రైవర్ తమకేమీ పట్టనట్టు బస్సును ఆపకుండా తీసుకెళ్లిపోవడంతో బాధితులు ఆందోళన చెందారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## టపాసుల విక్రయదారులు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి

**వెంకటగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



టపాసులు తయారు చేసే వారు, విక్రయించే వారు తప్పనిసరిగా నిబంధనలను పాటించాలని సిఐ ఏ. వెంకటరమణ తెలిపారు. వెంకటగిరిలోని బాణసంచా తయారీదారుల గదాములను సిఐ, ఎస్ఐ సుబ్బారావులు పరిశీలించారు. టపాసులు తయారు చేసేవారు నిబంధనలు పాటించకపోతే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రజల సంచరించే ప్రాంతాల్లో టపాసులు తయారు చేయరాదని సూచించారు. టపాసులు విక్రయాలను కూడా బహిరంగ ప్రదేశల్లో చేయరాదని తెలిపారు. ఇంకా పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

## 2029 ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పనిచేయాలి

**నియోజకవర్గ ఇన్చార్జిలకు సూచించిన మాజీ సీఎం జనగ్మోహన్ రెడ్డి**

**వెంకటగిరి, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త**



2029లో జరగబోయే ఎన్నికల్లో వైసిపి గెలుపే లక్ష్యంగా అందరూ పనిచేయాలని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, మాజీ సిఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నాయకులకు సూచించారు. తాడేపల్లిలోని జగన్మోహన్ రెడ్డి నివాస గృహంలో జరిగిన నియోజకవర్గ ఇన్చార్జిల సమావేశంలో నేదరుమల్లి రామ్ కుమార్ రెడ్డితో సహా నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు కార్యకర్తలకు అండగా ఉండాలని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం తప్పిదాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. 2029 ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని అందరూ పనిచేయాలని సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలకు మనోధైర్యం నింపాలని చెప్పారు. సమావేశంలో రాజ్యసభ సభ్యులు విజయసాయిరెడ్డి, మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జులు నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి, కిలివేటి సంజీవయ్య, మురళీధర్, ఆదాల ప్రభాకర్ రెడ్డి, అనిల్ కుమార్ రెడ్డి, మేకపాటి విక్రమ్ రెడ్డి, ఎమ్మెల్యే చంద్రశేఖర్ రెడ్డిపాల్గొన్నారు.

## అర్హులందరికీ తప్పక సంక్షేమ పథకాలు అమలు

**– మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు**

**కుప్పం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**



అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో తప్పక లబ్ది కలిగిస్తామని కుప్పం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు పేర్కొన్నారు. బుధవారం మున్సిపల్ పరిధి శాంతి లేఔట్ ప్రాంతంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమా న్ని ఆయన చేపట్టారు. ఈసందర్భంగా గ్రామంలో ఈసందర్భ ంగా విద్యుత్ స్థ ంభాలు, రోడ్లు, డ్రైన్లు, పెన్షన్లు, హౌసింగ్‌కు సంబంధించి ప్రజలు వినతిపత్రాలు అందించారు. రేషన్‌కార్డులు, గృహ నిర్మాణాలకు గాను అత్యధికంగా వినతులు వస్తున్నట్లు ఆయన తెలిపారు. అర్హులకు తప్పక ఇళ్లు, పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నేత గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌దాము, కౌన్సిలర్లు సోమశేఖర్, వేలు, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మున్సిపల్ ప్రధాన కార్యదర్శి ఆర్ముగ ం, మాజీ సర్పంచ్ డికెపల్లి మణి, నేతలు మంజునాథ్, సర్దార్ బాషా, బాబు, నబీఉల్లా, గనిఉల్లా, సోమశేఖర్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు పంటనష్ట పరిహారం అందజేత

**రామకుప్పం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త**

మండలంలోని పిఎంకె తాండా గ్రామంలో ఏనుగుల దాడుల్లో పంటనష్టపోయిన రైతు ధనపాల్ నాయక్‌కు 18వేల రూపాయల చెక్కును అటవీ అధికారులు, నేతలు అందించారు. కార్యక్రమంలో నేతలు కృష్ణానాయక్, హరిబాబు, సుబ్రమణ్యం, అటవీ అధికారులు పాల్గొన్నారు.

## ఎన్నికల సంగ్రామానికి మజ్దూర్ యూనియన్ సంసిద్ధం

రేణిగుంట, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:

రైల్వే కార్మికులు ఉద్యోగుల సంక్షేమానికి మజ్దూర్ యూనియన్ చేస్తున్న సేవలు మరువలేనివని సౌత్ సెంట్రల్ మజ్దూర్ యూనియన్ జనరల్ సెక్రటరీ శంకర్రావు అన్నారు. రేణిగుంట రైల్వేస్టేషన్ సమీపంలోని బ్రాంచ్ మజ్దూర్ యూనియన్ కార్యాలయంలో బుధవారం శంకర్రావు మూడవ దఫా ఎన్నికలకు శంఖారావాన్ని పూరించారు. ఈ సందర్భంగా ఆయన రైల్వే ఉద్యోగులు కార్మికులను ఉద్దేశించి మాట్లాడుతూ దేశంలోనే రైల్వేశాఖలో అతి పెద్ద యూనియన్‌గా కార్మికుల అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్నట్లు మజ్దూర్ యూనియన్‌ను అభివర్ణించారు. కార్మికుల హక్కుల కోసం ఎల్లప్పుడూ పోరాడుతున్నదన్నారు. కార్యక్రమంలో డివిజనల్ కార్యదర్శి విజయకుమార్, అధ్యక్షులు సుదర్శన్‌రాజు, జనరల్ బ్రాంచ్ కార్యదర్శి సురేష్‌కుమార్, చైర్మన్ నరేష్, కోశాదికారి ఏ.ఆర్.సిన్హా, ఎల్ఆర్ఎస్ బ్రాంచ్ ఏడీఎస్ బాషా, కార్యదర్శి శ్రీనివాసులు, చైర్మన్ బాబు, ఆఫీస్ బేరర్లు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొని శంకర్రావును ఘనంగా సత్కరించారు.

## తుఫాను బాధితులకు శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ విరాళం

శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త

రాష్ట్రంలో చోటు చేసుకున్న విపత్కర పరిస్థితి దృష్ట్యా రాష్ట్ర నలుమూలల నుంచి ప్రభుత్వానికి విరాళాల వెల్లువ వస్తుంది. ఈనేపథ్యంలో బుధవారం శ్రీ సిటిలోని శ్రీనివాస కన్‌స్ట్రక్షన్స్ అధినేత శ్రీనివాస్ విజయవాడ వరదబాధితుల సహాయార్థం రూ.లక్ష చెక్కును అందించారు. ఈ చెక్కును పట్టణ పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్ సారథ్యంలో చెక్కును ఊరందూరు గ్రామంలోని శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డికి చెక్కును అందించారు. ఈ కార్యక్రమాల్లో జి.గోపినాథ్, ఎంఎం వాడ మధు, గుత్తా విజయనాయుడు, నింద్ర సుధాకర్ తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## కూరగాయల సాగుతో రోజువారి ఆదాయం:

శ్రీకాళహస్తిరూరల్, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



కూరగాయల సాగుతో రైతులకు రోజూ వారి ఆదాయాలు వస్తాయని బుధవారం మండలంలోని తిరుమంజనం వారి కండ్రిగలో ఏర్పాటు చేసిన రైతు అవగాహన సదస్సులో వ్యవసాయాధికారులు వివరించారు. కూరగాయల సాగుపై అవగాహన సదస్సును బుధవారం శ్రీకాళహస్తి వ్యవసాయాధికారి భాస్కరయ్య అధ్యక్షతన జరిగింది. కూరగాయల సాగుతో సన్న,చిన్న కారు రైతులకు రోజు వారి ఆదాయం లభిస్తుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య వివరించారు. కూరగాయల సాగుతో కొద్ది విస్తీర్ణంలో కూడా రైతులకు మంచి ఆదాయం వస్తుందన్నారు. తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన కకేంద్రం శాస్త్రవేత్త నాగమణి కూరగాయల సాగులో చేపట్టాల్సిన పురుగుల నివారణకు యాజమన్యం గురించి రైతులకు వివరించారు. శ్రీకాళహస్తి ఏడిరమేష్‌రెడ్డి సాగులో సేంద్రీయ ఎరువుల వినియోగం పెంచాలని కోరారు. వరి వేరుశెనగలో మేలైన యాజమాన్యం గురించి ఏఓ వేణుగోపాల్‌రావు వివరించారు. శ్రీకాళహస్తి ఉద్యాన అధికారి పుష్పలత,రైతులు ఆయిల్ ఫాం పంటను సాగు చేయాలని కోరారు. ఒక హెక్టారుకు రైతులకు రూ.64వేలు రాయితి వస్తుందన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎఓ సుధాకర్‌రెడ్డి,గ్రామ వ్యవసాయ విస్తర్ణధికారిసరిత పాల్గొన్నారు.

## శివయ్య సేవలో దేశం ప్రధాన కార్యదర్శి

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో అతిధుల తాకిడి పెరుగుతుంది. బుధవారం తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు కుటుంబసభ్యులతో స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ఉమ్మడి పార్టీ నాయకులు స్వాగతం పలికారు.తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి,ఉమ్మడి కర్నూలు జిల్లా మాజీ అధ్యక్షులు సోమిశెట్టి వెంకటేశ్వర్లు స్వామి దర్శనానికి వచ్చారు.వారు స్వామి అమ్మవార్లను అంతరాలయ దర్శనం చేసుకున్నారు.స్వాగతం చెప్పినవారిలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ గుమ్మడి దశరధాచ్చారి, తెలుగుదేశం పార్టీ మాజీఅధ్యక్షుడు వాకచర్ల గురప్పశెట్టి, తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్,పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, మాజీ టౌన్‌బ్యాంకు అధ్యక్షుడు డివి నారాయణ,ప్రసాద్,సుబ్బారావు, తదితరులు స్వాగతం పలికారు. దర్శనానంతరంఅతిధులకుస్వామిఅమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. దుశ్శాలువతో సత్కరించారు.

## పల్లాకు శివయ్య ప్రసాదాలు:

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావును బుధవారం శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు కలసి శ్రీకాళహస్తీశ్వరుని ప్రసాదాలను దుశ్శాలువతో సత్కరించారు. శ్రీకాళహస్తి నియోజకవర్గానికి చెందిన ఎస్‌సివి నాయుడుకు సత్యవేడు, సూళూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో బలమైన అనుచర వర్గం ఉంది. ఏ ఎన్నికల్లో అయినా అక్కడ అభ్యర్థులుగెలవాలంటే ఎస్‌సివి మద్దతు కావాల్సిందే. ఎన్నికల ముందు పార్టీ అధ్యక్షుడు నారాచంద్రబాబు నాయుడు ఎస్‌సివి నాయుడు భవిష్యత్తుకు తాను భరోసా అంటూ హామీ ఇచ్చారు.ఈ నేపధ్యంలో ఆయన పార్టీ విజయానికి పని చేసారు. బుధవారం ఎస్‌సివి నాయుడు పార్టీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌రావును కలసి సత్కరించారు. పార్టీ పని తీరు పథకాలపై ప్రజల స్పందనను వివరించారు.ఎస్‌సివితో పాటు గోగినేని భాస్కర్‌నాయుడు, పామంజి సుబ్రమణ్యంలు ఉన్నారు.

## ఫ్రీహోల్డ్ భూములపై విఆర్‌ఓలు, సర్వేయర్లతో సమీక్ష

.తొట్టంబేడు, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త

మండలంలో ఫ్రీహోల్డ్ భూములపై విఆర్‌ఓలు, సచివాలయ సర్వేయర్లతో తహశీల్దార్ మధుసూధనరావు సమావేశాన్ని నిర్వహించారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 27 రెవెన్యూ గ్రామాల్లో 173.19 ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్ చేశారని సర్వేనంబర్, పట్టాదారులును కలసి వారం రోజుల్లో కలసి పూర్తిచేశాయాలని జిల్లా కలెక్టర్‌ఆదేశాలు జారిచేశారని సంబందిత విఆర్‌ఓలు, సర్వేయర్లకు సూచించారు. ఎక్కడైనా అవినీతి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని వివరించారు. ఒకరి భూములు ఇంకొకరిపై మార్చి ఉంటే వారు వచ్చిన తనను నేరుగా కలసి సమస్యను వివరించవచ్చని తహశీల్దార్ మధుసూధనరావు తెలిపారు. ఇక ఇసుక పాలసీపై ప్రభుత్వం కొత్త విధానాన్ని ప్రకటించిందన్నారు.

## సిఎం సహాయనిధికి రూ.1.50లక్షలు విరాళం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త



ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ఇటీవల విజయవాడలో కురిసిన భారీ వర్షాలకు నష్టపోయిన వారికి సహాయార్థంగా నియోజకవర్గ శాసనసభ్యులు బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్ర ఎస్టి సెల్ అధ్యక్షులు దారునాయక్ ఆధ్వర్యంలో సిఎం సహాయనిధికి రూ.1.50లక్షలు చెక్కును తిరుపతి పార్లమెంటు ఎస్టి సెల్ అధ్యక్షుడు యం.సుబ్బయ్య మరియు రాష్ట్ర ఎస్టి సెల్ అధికార ప్రతినిధి పీరిగల నవీన్, మరియు జమ్మలమడుగు అధ్యక్షులు హనుమంతు అందించారు.

## స్వాహా చేసిన నగదును రికవరీ చేయిస్తాం..ఎపిఎం

.తొట్టంబేడు, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త

మండలంలోని చియ్యవరం పంచాయతీ పరిధిలో వెలుగు మహిళా సంఘాల్లో దుర్వినియోగం జరిగిన విషయం విదితమే. ఒక్క చియ్యవరం పంచాయతీలోనే 56 గ్రూపులు ఉండగా 700మంది మహిళలు ఉన్నారు. గ్రామంలో సంఘమిత్రలు సుమారు 2కోట్లు దుర్వినియోగం చేసిన విషయాలు పత్రికల్లో ప్రచురితం కావడంతో ఉన్నతాధికారులు విచారణకు సిద్ధమయ్యారు. చియ్యవరం పంచాయతీ పరిధిలో వెలుగు మహిళా సంఘాల నగదు స్వాహా చేసిన సంఘమిత్రలపై చర్యలు కూడా తీసుకున్నామని ఎపిఎం గురుమూర్తి అన్నారు. దుర్వినియోగం చేసిన నగదును ఈనెల 25వ తేదీన చెల్లించే విధంగా గ్రామ కమిటీ తీర్మానంచేసిందన్నారు.ఈనిధులదుర్వినియోగంపైఉన్నతాధికారులుత్వరలోనేవిచారణచేస్తారనివివరించారు

## బిసి సాధికారతే లక్ష్యంగా అడుగులు

.శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 18 ప్రభాతవరత్త



నిత్యం అగ్రవర్ణ దురంహాకారంతో రగిలిపోయే జగన్‌రెడ్డి నాయకత్వంలోని గత వైసిపి ప్రభుత్వం చేతిలో అణచివేతకు గురైన బిసి వర్గాల సాధికాతే లక్ష్యంగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని తెలుగుదేశంపార్టీ బిసి విభాగం నాయకులు తెలిపారు. ఈసందర్భంగా పలువురు బిసి నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో గల బిసి వర్గాలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పటికే ఉన్న 34శాతం రిజర్వేషన్లకు కోతపెట్టి 10శాతం తగ్గించి రాష్ట్ర వ్యాప్తంగా 16వేల మంది బిసిలకు వివిధ పదవులను దూరం చేసిన ఘరానా మోసగాడు జగన్‌రెడ్డి చర్యలకు విరుగుడుగా నేడు సిఎం చంద్రబాబునాయుడు నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చట్టసభల్లో బిసిలకు 33శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి నిర్ణయించడం ద్వారా బిసి వర్గాల సాధికారతకు చంద్రన్న నాయకత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని కొనియాడారు.బిసిల అభ్యున్నతికి ఉపయోగపడే విధంగా రాష్ట్రంలో ఐదు చోట్లు ప్యాకల్టీ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేయడానికి సిఎం చంద్రబాబునాయుడు నిర్ణయించడం ఎంతో గొప్పదని కొనియాడారు. నాయకఉలు మిన్నల్‌రవి, డా.యం. ఉమేష్ రావు , నెమళ్ళూరుసుబ్రమణ్యం, కోటచంద్రశేఖర్, జిల్లా నాయకుడు సునీల్, శివ, భాస్కర్, మణి, వంశీ,పాల్గొన్నారు.

## 20న అన్నా క్యాంటీన్‌లు ప్రారంభం..ఎంఎల్‌ఏ

**.తొట్టంబేడు, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త** పేదలకు పట్టెడు అన్నంపెట్టాలనే దృడసంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న క్యాంటీన్ ను పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద మరియు స్వర్ణముఖినది సమీపాన ఉన్న అన్న క్యాంటీన్‌ను ఈనెల 20వ తేదీన ప్రారంభిస్తున్నామని ఎంఎల్‌ఏ సుధీర్‌రెడ్డి తెలిపారు. గత ఎన్నికల్లో తమ నాయకులు సిఎం చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చేదిశగా వందరోజుల పాలనలో అనేక సంక్షేమాలు ప్రవేశపెట్టి ప్రజల వద్ద మనన్నల్ని పొందారని ఈనేపధ్యంలోతాను కూడా శ్రీకాళహస్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి సాధిస్తామన్నారు. నిరుపేదలకు రూ.5లకే భోజనాన్ని అందిస్తున్నామని తెలిపారు.

## నాల్గవ విడత ఐటిఐకి ధరఖాస్తులు ఆహ్వానం

వెదురుకుప్పం,సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :

పారిశ్రామిక శిక్షణ కేంద్రంలో చేరడంకు నాల్గవ విడత ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ భైరవుడు బుధవారం తెలిపారు. 2024-2025 విద్యాసంవత్సరంలో ఐటిఐ చదవడంకు ఆశక్తిగల విద్యార్థులు సెప్టెంబర్ 26 సాయంత్రం 5 గంటలలోపు ఐటిఐ.ఎపి.జిఓవి.ఇన్ వైబ్‌సెట్ నందు అప్లై చేసుకొవలెనని చెప్పారు. ప్రవేశం కొరకు ధరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు సెప్టెంబర్ 27 మధ్యాహ్నం 3 గంటలలోపు గర్నమెంటు ఐటిఐ, వెదురుకుప్పం నందు తమ ఒరిజనల్ సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేసుకోవాలి. సెప్టెంబర్ 28 ఉదయం 10 గంటలకు తమ ఒరిజనల్ సర్టిఫికెట్లతో ఇంర్వ్యూకు వెదురుకుప్పం ప్రాథమిక పాఠశాల ఆవరణంలోగల ప్రభుత్వ ఐటిఐ నందు హాజరుకావలన్నారు. ఇతర వివరాలకు 9533723022,9492571731,9533394950 సంప్రదించాలని చెప్పారు.

## ఓజోన్ పొర పరిరక్షణపై అవగాహన అవసరం : ప్రిన్సిపాల్

వెదురుకుప్పం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త :



ఓజోన్ పొర పరిరక్షణ పై అవగాహన అవసరమని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద పేర్కొన్నారు. బుధవారం కళాశాలలో ఓజోన్‌పొర దినోత్సవం పురష్కరించుకుని రసాయన శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో ఓజోన్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాతావరణంలోని ఓజోన్‌పొర సూర్యకాంతిలోని అతినీలలోభిత కిరణాలను శోషించడం వలన భూమి పై ఉన్న జీవరాసులను రక్షిస్తుందన్నారు. సూర్యకాంతిలోని అతినీలలోహిత కిరణాలు నేరుగా భూమి పై పడటం వలనఅనేక చర్మవ్యాధులు, రుగ్మతలకు కారణమవుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీప్రసన్నలత, రసాయన శాస్త్రవిభాగ అధిపతి డాక్టర్ ప్రభాకరరావు, బోటనీ విభాగ అధిపతి భక్షు, ఐక్యూఏసీ కో-ఆర్డినేటర్ వెంకటేష్,అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గ్రావెల్ లారీకి రూ.25 వేలు జరిమానా

**నగరి, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:** అక్రమంగా గ్రావెల్‌తరలిస్తున్న లారీకి తహసీల్దార్ రవికుమార్ రూ.25 వేలు జరిమానా విధించారు. బుధవారం నాగరాజుకుప్పం గ్రావెల్ క్వారీ వద్ద ఆకస్మిక తనిఖీ నిర్వహించిన ఆయన అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న లారీకి తొలి హెచ్చరిక కింద రూ.25 వేలు జరిమానా విధించారు.

## ప్రగతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ పోషకాహార మాసోత్సవం

రేణిగుంట, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:

ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో రేణిగుంట మండలం గుత్తివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషకాహార మాసోత్సవం ఘనంగా నిర్వహించారు. మాత శిశు సంక్షేమ శాఖ ద్వారా తల్లులకు, గర్భిణీలకు, బాలింతలకు ఎలాంటి పోషకాహారాలు అందజేయాలో తెలియజేశారు. పోషకాహార విలువలను వివరించారు. ముఖ్యంగా కూరగాయలు, ఆకు కూరలలో ఉన్న పోషకాలను గురించి వివరించి పోషకాలు లేని ఎంత ఆహారం భుజించిన శరీరానికి తగిన శక్తి రాదని తెలిపారు. కార్యక్రమంలో ప్రగతి కో-ఆర్డినేటర్ జయలక్ష్మి, సురేష్, సిబ్బంది స్కూలు టీచర్లు పాల్గొన్నారు. ఇలా ఉండగా ప్రగతి స్వచ్ఛంద సేవా సంస్థ రేణిగుంట, ఏర్పేడు మండలాల్లో వరద బాధితుల కోసం సేకరించిన విరాళం 75 వేలు చెక్కును జిల్లా కలెక్టర్ ద్వారా ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారు. కార్యక్రమంలో ప్రగతి డైరెక్టర్ కె.వి.రమణ, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## మహేంద్ర వీరో కమర్షియల్ లగేజ్ వెహికల్ లాంచింగ్

తిరుపతి విద్య,సెప్టెంబర్ 18,ప్రభాతవార్త:



స్థానిక రేణుగుంట రోడ్డులో ఉన్న మహుంద్ర షో రూమ్ లో బుధవారం మహేంద్ర వారు సరికొత్త మోడల్ వీరో కమర్షియల్ లగేజ్ వెహికల్ ను లంచ్ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బాలాజీ ఏజెన్సీస్ అండ్ ఇండస్ట్రీస్ సీఈవో కిరణ్మయి హాజరయ్యారు. ఈ వెహికల్ ప్రారంభ ధర ఎనిమిది లక్షల 49 వేల నుంచి ప్రారంభమవుతుందని అన్నారు.జిపిఎస్ ట్రాకింగ్ ఇందులో స్టాండర్డ్ అండ్ హై డెక్ కార్గో లభించును అని,సేఫ్టీ లో ఏఐఎస్ 096నార్మ్స్ కలదని అన్నారు.కమర్షియల్ మేనేజర్ శ్రీనివాసులు,బాలాజీ ఏజెన్సీ సిబ్బంది పాల్గొన్నారు.

## పంటల సంరక్షణపై శ్రీరామ్‌ఫార్మ్ కొత్తరకం ఉత్పత్తులు

-ప్రత్యేక మొక్కల పోషకాహార ఉత్పత్తులు

తిరుపతి,సెప్టెంబర్ 18ప్రభాతవార్త:

రైతులు సాగుచేసే వ్యవసాయ పంటలు,ఉద్యానపంటలలో ఎక్కువగా కనిపించే రసం పీల్చే,ఆకు నమిలే పురుగుల నుండి మెరుగైన పంటరక్షణకు శ్రీరామ్‌ఫార్మ్ ఐదు కొత్తరకం ఉత్పత్తులు మార్కెట్లోకి అందుబాటులోకి తీసుకువచ్చింది. ఇవన్నీ సాంకేతికతతో సూక్ష్మంగా రూపొందించబడ్డాయని ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ .బిజినెస్‌హెడ్ సంజయ్బాట్రా తెలిపారు. వ్యవసాయ ఆవిష్కరణల హద్దులను శ్రీరామ్‌ఫార్మ్‌సొల్యూషన్స్ అధిగమిస్తూనే ఉందన్నారు. ఈ కొత్త ఉత్పత్తి ఆవిష్కరణలు పెంపకం దారులను ,అభివృద్ధి చెందుతున్న అవసరాలను పరిష్కరించే స్థిరమైన వ్యవసాయ పద్ధతులను నడిపిస్తుందన్నారు. స్పెషాలిటీ ప్లాంట్ న్యూట్రిషన్ విభాగంలో శ్రీరామ్‌ఫార్మ్‌సొల్యూషన్స్, శ్రీరామ్‌మెట్రోటజ్‌ను పరిచయం చేసింది. నానోలిక్విడ్‌టెక్నాలజీని అందిపుచ్చుకుని అభివృద్ధిచేయబడిన విప్లవాత్మక ఉత్పత్తి అన్నారు. ఈ ఉత్పత్తులు పంటల ఆరోగ్యకరమైన, అధిక దిగుబడినిస్తుందన్నారు.

## ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న కేబుల్స్‌ను నెలరోజులు లోపు సరిచేయాలి

కేబుల్ ఆపరేటర్లను ఆదేశించిన కమిషనర్ ఎన్. మౌర్య

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త



తిరుపతి నగరంలో ప్రజలకు ఇబ్బంది కలిగిస్తున్న కేబుల్స్‌ను నెలరోజులు లోపు సరిచేయాలని కేబుల్ ఆపరేటర్లను కమిషనర్ ఎన్. మౌర్య ఆదేశించారు. బుధవారం నగర పాలక సంస్థ కార్యాలయంలో స్థానిక కేబుల్ ఆపరేటర్స్, ఇంటర్నెట్ ప్రొవైడర్స్‌తో ఏపిఎస్పీడీసిఎల్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో కమిషనర్ మౌర్య నగరంలో ఎక్కడపడితే అక్కడ అస్తవ్యస్తంగా కేబుల్స్ ఉన్నాయని అన్నారు. దీంతో వాహన చోదకులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అస్తవ్యస్తంగా కేబుల్స్ వలన కడపలో జరిగిన సంఘటనను ఆపరేటర్స్‌కు, ఇంటర్నెట్ ప్రొవైడర్స్‌కు గుర్తు చేశారు. ఎవ్వరికీ ఇబ్బందులు కలగకుండా సూచించిన క్రమ పద్ధతిలో వైర్లను ఏర్పాటు చేసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో కార్పొరేటర్లు నరసింహ ఆచారి, నరేంద్ర, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, స్మార్ట్ సిటీ జిఎం చంద్రమౌళి, డిసిపి శ్రీనివాసులు రెడ్డి, ఎస్‌పిడిసిఎల్, బిఎస్ఎన్ఎల్ అధికారులు నగరంలోని లోకల్ కేబుల్ ఆపరేటర్స్ తదితరులు ఉన్నారు.

## బహిరంగ వేలం పాటకు విశేష స్పందన

శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయ

ఈఓ , పుట్టా రామకృష్ణారెడ్డి



**చంద్రగిరి, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:** చంద్రగిరి గ్రామదేవత శ్రీమూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో నిర్వహించిన బహిరంగ వేలం పాటకు విశేష స్పందన లభించినట్లు ఆలయ ఈఓ పుట్టా రామకృష్ణారెడ్డి తెలిపారు. ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించే తలనీలాలు, వస్త్రాలు, కొబ్బరి చిప్పలను సేకరించుకొనుటకు, పూజా సామగ్రి విక్రయించుకునేందుకు బుధవారం వేలం నిర్వహించారు. ఇందులో భాగంగా పూజా సామగ్రి విక్రయించుకునేందుకు ఏడాది కాలానికి 2024 అక్టోబర్ 19 నుండి 18 అక్టోబర్ 2025 వరకు రూ.2,80,000/-లకు చంద్రగిరికి చెందిన పి.మంజుల, అదేవిధంగా 2024 అక్టోబర్ 1 నుండి 30 సెప్టెంబర్ 2025 వరకు వస్త్రాలు సేకరించుకునేందుకు రూ.1,05,000/-లకు బి.పద్మావతి, కొబ్బరి చిప్పలు సేకరణకు రూ.1,11,000/-లకు డి.వెంకటరామయ్య హెచ్చు మొత్తంతో వేలం దక్కించుకున్నట్లు తెలిపారు. కాగా తలనీలాలు సేకరణకు ఎవ్వరూ ముందుకు రాకపోవడంతో వాయిదా వేశారు. ఈ వేలంలో గత ఏడాదికి హెచ్చు రూ.31,500/-లు ఆదియం లభించినట్లు ఈఓ తెలిపారు.

## తాటి బెల్లంలో ఆయుర్వేద విశిష్టతలు

చంద్రగిరి, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:



తాటి బెల్లంలో ఆయుర్వేద విశిష్టతలు వున్నట్లు ఎంఎల్‌ఏ పులివర్తి నాని తెలిపారు. శ్రీనివాస మంగాపురంలో బుధవారం ఆయన తాటి బెల్లం టీ (కాఫీ) సెంటర్‌ను ప్రారంభించారు.ఆయన మాట్లాడుతూ పురాతన కాలం నుండి తాటి బెల్లం టీ ప్రత్యేకత కలిగి వున్నట్లు తెలిపారు. ఆరోగ్య రక్షణకు తాటి బెల్లం టీ దోహద పడుతుందన్నారు. కడుపులో మంట, అజీర్ణం, మలబమద్ధకం వంటి ఇబ్బందులను తగ్గిస్తుందన్నారు. టీ, కాఫీ తయారీని పరిశీలించి, సేవించిన ఆయనరుచిఅద్భుతంగావుందన్నారు.యజమానికిమొదటిసారి నగదును చెల్లించి అభినం దనలు తెలిపారు.

## అతిగా రసాయనాలతో సాగులో అనర్థాలు

ఏర్పేడు, సెప్టంబరు 18,ప్రభాతవార్త;

సాగు భూములకు ఎక్కువగా రసాయన ఎరువులు , పురుగు, కలుపు మందుల వాడకం రైతులకు మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతుందని జిల్లా వ్యవసాయ వనరుల కేంద్రం ఏడిఏ భాస్కరయ్య తెలిపారు. మండలంలోని బండారుపల్లి గ్రామంలో రైతు శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రసాయనాలు ఎక్కువగా వాడకం వలన భూములు జీవాన్ని కోల్పోయి నిస్సారమవుతున్నాయని తెలిపారు. నిర్జీవమైన నేలకు ఎంత ఖర్చు చేసినా ఆశించిన ప్రయోజనం రాదని తెలిపారు. పంటలకు అధిక యూరియా వాడకంలో చీడల బెడద పెరుగుతుందన్నారు. ఆయిల్ ఫామ్ సాగుకు ఉద్యాన శాఖ రూ.64000 వేల రూపాయల ప్రోత్సాహన్ని రైతులు వినియోగించుకోవాలని ఉధ్యాన శాఖ అధికారి పుష్పలత తెలిపారు. భూములు భూగర్భ జలాల కాలుష్య నివారణకు రైతులు నానో ఎరువులను వాడాలని ఇఫ్కో క్షేత్ర అధికారి మణిచంద్ర పేర్కొన్నారు. రబీలో చేపట్టవలసిన మేలైన యాజమాన్య పద్దతులను ఏఓ వేణుగోపాలరావు వివరించారు. మునుముందు సాగుపై మరింత విజ్ఞానాన్ని అందించటం కోసం అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తామని శ్రీకాళహస్తి ఏడిఏ రమేష్‌రెడ్డి పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో రైతులు, ఏఓ షణ్ముగం, గ్రామ వ్యవసాయ సహాయకులు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రధమ చికిత్స పై శానిటేషన్ వర్కర్స్ కి అవగాహనా కార్యక్రమం

తిరుపతి విద్య, సెప్టెంబర్ 18ప్రభాతవార్త:




స్వచ్ఛతాహి సేవ అభియాన్ 24లో భాగంగా ఎన ఎస్ఎస్ బ్యూరో,మహిళా అధ్యయన విభాగం, ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫార్మా సిటికల్ టెక్నాలజీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం మహిళా వర్సిటీలో ఉన్న శానిటేషన్ వర్కర్స్‌కి ప్రథమిక చికిత్స పైన శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ప్రో.విద్యావతి మాట్లాడుతూ,అత్యవసర పరిస్థితులలో చేసే ప్రధమ చికిత్స వలన పరిస్థితి తీవ్రం కాకుండా ఉండి ప్రాణాలు కాపాడే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.అనంతరం స్విమ్స్ ఇంటర్నల్ మెడిసెన్ విభాగం నుండి విచ్చేసిన డాక్టర్ మనోజ్ ఈ అంశంపై అవగాహన కల్పిస్తూ, శానిటేషన్ వర్కర్లు ప్రతిరోజు ఆరోగ్యానికి హాని కలిగించే పరిస్థితులలో పని చేస్తూ ఉంటారు కాబట్టి వారు ప్రాథమిక చికిత్స పద్దతులపై అవగాహన కలిగి ఉండడం చాలా ముఖ్యమని,దీని ద్వారా స్వీయ సంరక్షణతో పాటుగా,ఇతరులకు సాయం అందించే సామర్థ్యం కలిగి ఉంటారని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణులు డా.నీరజ,డా.సుజాత వజిహ భాను,80 మంది శానిటేషన్ వర్కర్స్ పాల్గొన్నారు.

## నగరిలో ప్రధాని మోదీ జన్మదిన వేడుకలు

నగరి, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:



నగరి మండలంలో బీజేవైఎం చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి గాంధీ ఆధ్వర్యంలో నగరి మండలం బీజేవైఎం అధ్యక్షుడు రాము, ముఖ్య అతిథిగా టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్‌లు పాల్గొని టవర్‌క్లాక్ వద్ద ప్రధాని మోదీ జన్మదిన కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి గాలి గాంధీ, బీజేవైఎం నగరి మండల అధ్యక్షుడు రాము, టీడీపీ మండల అధ్యక్షుడు రమేష్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సౌందర్య పాండి, టీడీపీ నాయకులు అల్లిముత్తు, బీజేపీ జిల్లా వీవర్స్ సెల్‌మెంబరు మనీ, మండల నాయకులు, ఎన్‌డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు.

## బెల్ట్ తీసిన శ్రీ సిటీ పోలీసులు

మద్యం సీసాలు స్వాధీనం - వ్యక్తి అరెస్టు

సత్యవేడు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:

శ్రీసిటీ పరిధిలోని మోపురుపల్లిలో మద్యం బెల్ట్ షాపు నిర్వహిస్తున్న ఓ వ్యక్తిని మంగళవారం సాయంత్రం అరెస్టు చేశారు. ఇతని నుంచి తమిళనాడు మద్యంను కూడా స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల కథనం మేరకు... మోపురుపల్లి పరిసరాల్లో కొందరు తమిళనాడు మద్యంను విక్రయిస్తున్నట్లు రహస్య సమాచారం పోలీసులకు అందడంతో దీంతో ఉన్నత అధికారులు ఆదేశాల మేరకు శ్రీసిటీ పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు, సిబ్బంది ఆ పరిసరాలపై ప్రత్యేక నిఘా ఉంచారు. మోపురుపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయ సమీపంలోని ఓ చిల్లర దుకాణం వద్ద ఎం.మహేష్ అనే వ్యక్తి మద్యం కలిగిన సంచితో అటు...ఇటుగా తిరగడం గమనించిన పోలీసులు అతని పట్టుకోవడం జరిగిందన్నారు. మహేష్‌ను గట్టిగా విచారించడంతో మద్యం గొలుసు దుకాణం నిర్వహిస్తున్నట్లు తేలింది. నిందితుని దగ్గరనుంచిఏడు క్వార్టర్ బాటిళ్లు, ఒక బీరు బాటిల్ స్వాధీనం చేసుకున్నట్లు శ్రీసిటీ పోలీసులు తెలిపారు.

## ఎస్‌జీఎఫ్ అండర్-14 జిల్లా జూడో జట్లు ఎంపిక

వడమాలపేట, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:



అండర్-14 ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలుర, బాలికల జూడో జట్లను బుధవారం వడమాలపేటలో స్కూల్‌గేమ్స్ సెక్రటరీ బాబు ప్రకటించారు. స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి 200 మంది క్రీడాకారులు హాజరయ్యారు. తిరుపతి డీఈవో వి.శేఖర్ ముఖ్య అతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. తిరుపతి జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ బాబు ఎంపిక పోటీలను పర్యవేక్షించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కరుణా నవనీతం, పీడీలు జేమ్స్, సాంబశివరావు, జయప్రకాష్, శ్రీధర్, పుష్పవాణి, ప్రసన్నకుమారి, త్రిలోక సుందరి పాల్గొన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా బాలుర జట్టు హేమ, సాయి, భానుప్రసాద్(మంగళం), దిలీప్, గౌతమ్(రామకుప్పం), నాగరాజు(పల్లం), మణికంఠ, గంగాధర(తిరుపతి), బాలికల జట్టులో లీల, వెన్నెల(వడమాలపేట, అనూష, పూజిత(రేణిగుంట), భావన, పూజ(మంగళం), గీతిక(తిరుపతి).

## ఉపాధి ఏపీవో సమస్యలపై స్పందించడం లేదు - టీడీపీ

విజయపురం, సెప్టెంబరు 18 ప్రభాతవార్త

విజయపురం మండల ఉపాధి ఏపీవో సమస్యలపై స్పందించడం లేదని మండలంలోని కేవీ పురం, ఎం అగరం టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు. బుధవారం మండల కేంద్రమైన విజయపురంలో మాట్లాడుతూ గ్రామంలో ఉపాధి పనులపై సమస్యలపై ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. క్షేత్ర స్థాయిలో జరిగే వివరాల నివేదికను ఉన్నత అధికారులకు సమర్పించకుండా గతంలో పని చేసిన వారితో చేతులు కలిపి కాలయాపన చేస్తున్నదని, ఈ విషయమై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బాబునాయుడు, దామునాయుడు, రామకృష్ణమనాయుడు, మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## సమయపాలన పాటించని సచివాలయ సిబ్బందులు

విజయపురం, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:




మండలంలోని సచివాలయాల్లో సమయపాలన పాటించడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలో 11 సచివాలయాలు ఉన్నాయి. ఉదయం 10 గంటలకు హాజరు కావాల్సిన సచివాలయ సిబ్బంది 11 గంటలు అయినా కార్యాలయానికి వచ్చే దాఖలు కనిపించడం లేదని, సాయంత్రం 5 గంటల వరకు ఉండాల్సిన వారు 4 గంటలకే కనిపించడం లేదని వాపోతున్నారు. కొందరు సమయానికి కార్యాలయానికి వచ్చినా బయోమెట్రిక్ హాజరు వేసుకుని సొంత పనుల నిమిత్తం వెళ్లి పోతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో ఎక్కువ శాతం సచివాలయ సిబ్బంది స్థానికులే కావడంతో ఎక్కువ శాతం హాజరు వేసుకుని ఇంటికి వెళుతున్నారని, వారిని ప్రశ్నించేవారు లేరని వాపోతున్నారు. సచివాలయంలో పంచాయతీ కార్యదర్శి మిగిలిన సచివాలయ సిబ్బందిని సమన్వయం చేసుకుని పనులు చేసుకోవాలికానీ పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బం దుల మధ్య సఖ్యత లోపించడంతో ఎవరికి వారు యమునా తీరుగా మారుతోందని ఆరోపిస్తున్నా రు. గ్రామసభలకు కూడా హాజరయ్యే పరిస్థితి కనిపించడం లేదని, ఒకటి, రెండు తేదీల్లో పింఛన్ పంపిణీ చేసిన తరువాత వారు సకాలంలో ఆఫీసులకు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని టీడీపీ నాయ కులే ఆరోపణలుగుప్పిస్తున్నారు. ఈసచివాలయాలఉన్నాకూడా ఫలితం లేదని గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

## పాముకాటుకు మహిళ మృతి

పుత్తూరురూరల్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:



పాముకాటుతో మహిళ మృతి చెందిన సంఘటన పుత్తూరులో చోటు చేసుకుంది. నింద్ర మండలానికి చెందిన ధనంజయరాజు, రూప దంపతులు పుత్తూరు జెండామాను వీధిలో ఉంటున్నారు. ఇద్దరు పిల్లలను స్కూలు నుంచి మంగళవారం రాత్రి 7 గంటలకు తీసుకొస్తుండగా రూప (42) పొరపాటున పామును తొక్కడంతో అది కాటు వేయడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం తిరుపతికి తరలిస్తుండగా మార్గమ ధ్యంలో మృతి చెందినట్లు వారు తెలిపారు.

## పుత్తూరు మండలంలో అంగన్‌వాడీ మాసోత్సవాలు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:

ఐసీడీఎస్ ప్రాజెక్టు పుత్తూరు పరిధిలోని శ్రీరంగ చెరువు అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసోత్సవాల్లో భాగంగా సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీడీపీవో కసిరెడ్డి పద్మజ పాల్గొని మాట్లాడుతూ పోషకాహార ఆవశ్యకత గురించి కమ్యూనిటీకి అవగాహన కల్పించారు. పిల్లలు తక్కువ బరువుతో పుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకో వాలని సూచించారు. గర్భవతులు, అంగన్‌వాడీ కేంద్రంలో ఇచ్చే అన్ని సేవలు, పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండే బిడ్డకు జన్మ నివ్వాలని తెలియజేశారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు చేశారు. సూపర్‌వైజర్ సంధ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు యశోద, నీరజ, అంగన్‌వాడీ సహాయకురాలు, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.


**SRI G.K REDDY SCHOOL OF NURSING**

Krishna Nagar, Muthyala Reddy Palli,
Tirupati, Tirupati Dt. 517 501

Go.MS.No.292/Date: 05-11-2012-AP NMC/GNT/2421/2019- Dt.23-07-2019

2024-25 సంవత్సరమునకు సంబంధించి GNM కోర్సులకు అడ్మిషన్లు జరుగుచున్నవి.

| కోర్సు | విద్యార్హత | మేనేజ్‌మెంట్ సీట్స్ | గవర్నమెంట్ సీట్స్ | వయస్సు |
|---|---|---|---|---|
| GNM | INTER ఎనీ గ్రూప్ | 24 | 36 | 16 సం॥ నుండి 29 సం॥ వరకు |

అర్హత గల అభ్యర్థినిలు అడ్మిషన్లు కొరకు వారి ఒరిజినల్ సర్టిఫికేటలతో వెంటనే కార్యాలయం నందు సంప్రదించగలరు.

గమనిక : SC, ST, BC (C) విద్యార్థినులకు స్కాలర్‌షిప్ సౌకర్యం కలదు.
మా కళాశాల నందు కోర్సు పూర్తి చేసిన వారికి హాస్పిటల్ నందు నెలకు 15,000/- రూపాయలతో ఉద్యోగ అవకాశము కల్పించబడును.

కరస్పాండెంట్ : గోసల దశరధ రామిరెడ్డి, సెల్: 9492336939, 9059643969



### భక్తులకు అసౌకర్యం లేకుండా

# ప్రశాంత గరుడసేవకు విస్తృత ఏర్పాట్లు

**-గ్యాలరీల్లోకి ప్రవేశనిష్క్రమణ మార్గాలు -టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి**

తిరుమల,సెప్టెంబర్ 18(ప్రభాతవార్త)ప్రతినిధి:
అక్టోబర్ 4వతేదీ నుండి జరగనున్న శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవల్లో ఐదవరోజు 8వతేదీ రాత్రి నిర్వహించే గరుడసేవకు విస్తృత ఏర్పాట్లుచేయాలని, ఇప్పటినుండే ప్రణాళికలు రూపొందించాలని టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి తెలిపారు. ఇందులో భాగంగా ఆరోజు ఉదయం నుండి మాఢవీధుల్లో గ్యాలరీల్లోకి ప్రవేశనిష్క్రమణమార్గాలు, హారతి పాయింట్లు, అన్నప్రసాద వితరణ, యాత్రికుల రద్దీ నిర్వహణ, పోలీసుల భద్రత, శ్రీవారిసేవకుల సేవలు, అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచడం, భక్తుల రవాణా, పార్కింగ్ తదితర అంశాలపై స్పష్టమైన సూచనలు చేశారు. బ్రహ్మోత్స వాలకు భారీగా భక్తులు వచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి అసౌకర్యం కలగకుండా మెరుగైన సమాచారం కోసం విస్తృత ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అన్ని ప్రత్యేక ప్రవేశ దర్శనాలు రద్దుచేశామన్నారు. గరుడసేవకు ముందుకోజు అక్టోబర్ 7వ తేదీ రాత్రి 9గంటల నుండి 9వతేదీ ఉదయం 6గంటల వరకు తిరుమల ఘాట్‌రోడ్లపై ద్విచక్రవాహనాలు పూర్తిగా నిషేధించినట్లు ఆయన తెలిపారు. ఇందుకు తిరుపతి,తిరుమల వాసులు,స్థానికులు సహకరించాలని కోరారు. బుధవారం రాత్రి తిరుమల గోకులం విశ్రాంతి భవనంలో జరిగిన ఈ సమావేశంలో టిటిడి సిఇ సత్యనారాయణ, సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి, అన్ని విభాగాల అధికారులు పాల్గొన్నారు.

## గణనాధునికి సాంస్కృతిక నీరాజనం



కాణిపాకం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:
కాణిపాకం దేవస్థానంలో జరుగుతున్న స్వామివారి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం భక్తుల కాలక్షేపం నిమిత్తం ఏర్పాటు చేసిన వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా అలరించాయి. బుధవారం జరిగిన రావణబ్రహ్మ వాహనసేవ సందర్భంగా స్థానిక ఆస్థాన మండపంలో దేవస్థానం, ఉభయదారుల సంయుక్త ఆధ్వర్యంలో పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈమేరకు ఉదయం నుండి రాత్రి వరకు ప్రముఖ కళాకారులచే హరికథలు, భక్తిగీతాలు, కూచిపూడి, భరతనాట్యం వంటి వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. అలాగే గ్రామోత్సవం ప్రారంభమైనప్పటి నుండి చెక్కభజనలు, కోలాటములు, లంబాడి నృత్యాలు వంటి కార్యక్రమాల ప్రదర్శనలు నిర్వహించారు. ఈకార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

# ఆ బార్‌లో 24 గంటలూ....మద్యం అమ్మకాలు

## పట్టించుకోని పోలీస్, ఎక్సైజ్ శాఖలు, ప్రభుత్వం మారిన తీరు మార్చుకోని అధికారులు

పుత్తూరు, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:
పుత్తూరు, సెప్టెంబరు 18 ప్రభాతవార్త : రాష్ట్రంలో ప్రభుత్వం మారినా పోలీస్, ఎక్సైజ్ శాఖాధికారుల్లో ఎటువంటి మార్పు రాలేదు. గత వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వంలో ఎలాగైతే విచ్చలవిడిగా అసాంఘిక కార్యక్రమాలకు ఊతమిచ్చారో అదే పంథాను ప్రస్తుతం తెలుగదేశం పార్టీ ప్రభుత్వంలో కూడా కొనసాగిస్తున్నారు. పుత్తూరు పట్టణంలో నిర్ధిష్ట వేళలు పాటించకుండా ఒక రోజులో 24 గంటల పాటు మద్యం బార్‌ను నిర్వహించడం దీనికి నిదర్శనంగా కనిపిస్తోంది. ఉదయం 11 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు మాత్రమే బార్ నిర్వహించాల్సి వుండగా రోజంతా బార్ తెరిచే వుంచుతున్నారు. గత వైసిపి ప్రభుత్వంలో మంజూరైన ఈ బార్ నిర్వహణకు వైసిపి నాయకుల మద్దతు వుండడం వల్ల నిర్ధిష్ట సమయం లేకుండా విచ్చలవిడిగా రోజంతా బార్ నిర్వహించేవారు. అటు పోలీస్, ఇటు ఎక్సైజ్ అధికారులు మామూళ్లు తీసుకుని చూసీచూడనట్టుగా వ్యవహరించేవారు. అప్పట్లో ఇళ్ల మధ్య బార్ నిర్వహించడం పట్ల చుట్టుపక్కల ప్రజలు పోలీస్, ఎక్సైజ్ అధికారులు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా వారు పట్టించుకోలేదు. ప్రజల వేదన అరణ్యరోదనగా మిగిలిపోయింది. పోలీస్, ఎక్సైజ్ అధికారుల



కనుసన్నల్లోనే 24 గంటల పాటు యదేచ్ఛగా బార్ నిర్వహించారు. రాష్ట్రంలో ప్రభుత్వం మారి మూడు నెలలు గడిచినా అధికారుల తీరులో మార్పు రాలేదు. పుత్తూరు పట్టణంలో డిఎస్పీ స్థాయి అధికారి వున్నప్పటికీ ఎటువంటి ప్రయోజనం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదుల మేరకు రెండు రోజుల క్రితం పట్టణ టిడిపి అధ్యక్షుడు గాలి జీవరత్నంనాయుడు స్వయంగా బార్ వద్దకు వెళ్లారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందిని ఎన్ని గంటలకు బార్ తెరుస్తారు అని ప్రశ్నించగా...ఉదయం ఆరు గంటలకే బార్ తెరుస్తామని అక్కడ పనిచేసే మునస్వామి అనే వ్యక్తి స్పష్టంగా సమాధానమిచ్చారు. తెల్లవారుజామునే మద్యం విక్రయించమని ఎవరు చెప్పారని అడిగితే... తమ యజమాని చెర్లోపల్లి చంద్ర యాదవ్ చెప్పారని తెలిపారు. అక్కడ జరుగుతున్న తతంగం మొత్తాన్ని ఆయన వీడియో తీసి స్థానిక ఎక్సైజ్, పోలీస్ శాఖ అధికారులతో పాటు ఆ శాఖల ఉన్నతాధికారులకు కూడా పంపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్ధిష్ట వేళలు లేకుండా రాత్రి, పగలు బార్ తెరిచి మద్యం అమ్మకాలు చేస్తుండడం వల్ల తాగుబోతుల వల్ల పట్టణంలో శాంతి, భద్రతల సమస్య ఏర్పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై చుట్టుపక్కల ప్రజలు, తాము కూడా ఎన్నిసార్లు విన్నవించుకున్నా సంబంధిత అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇదిలా వుండగా ఈ వీడియోలు స్థానికంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతుండడంతో వైసిపి ప్రభుత్వ హయాంలో జరిగిన చట్ట వ్యతిరేక కార్యక్రమాలు తెలుగుదేశం పార్టీ హయాంలో కూడా కొనసాగుతుండడం పట్ల ప్రజలు విస్మయం చెందుతున్నారు. దీనిపై పుత్తూరు అర్బన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ బార్ నిర్వాహకులకు నోటీస్ ఇచ్చామని, మళ్లీ తప్పు పునరావృతమైతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఎక్సైజ్ శాఖ ఎస్ఐ సుబ్బయ్య మాట్లాడుతూ వేళలు పాటించని విషయమై ఇది వరకే వారికి వార్నింగ్ ఇచ్చామని, మళ్లీ జరగకుండా చూస్తామని తెలిపారు.

## గరుడ వాహనంపై శ్రీమహావిష్ణువు

చంద్రగిరి, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:
శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వారు శ్రీమహా విష్ణువు అలంకరణలో గరుడ వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీనివాస మంగాపురంలో పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం గరుడవాహన సేవ అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామివారిని వేకువజామున సుప్రభాత సేవతో మేల్కొలిపి తోమాల అర్చనాది నిత్యకైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు స్వామివారి ఉత్సవమూర్తిని మండపానికి తీసుకు వచ్చి వివిధ రకాల సుగంధభరిత పుష్పాలు బంగారు ఆభరణాలతో విశేష అలంకరణ గావించి



గరుడ వాహనంపై అధిష్టింపజేశారు. భక్తుల గోవింద నామస్మరణల నడుమ వెండి వెన్నెలలో దేవదేవుడు ఆలయ తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులను ఆశీర్వదించారు. ఈ వాహనసేవలో స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈఓ వరలక్ష్మి, ఏఈఓ యం.గోపీనాద్, సూపరింటెండెంట్ వి.రమేష్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్, అసిస్టెంట్ మోహన్ నాయుడు, ఆలయ అర్చకులు నారాయణం శేషాచార్యులు, బాలాజీ రంగకుమార్, సిబ్బంది రవిచంద్రన్, డాక్టర్ ఇల్లందు లక్ష్మి రాజేష్, జమేదర్ మంకు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## రేపు మంత్రి నారా లోకేష్ రాక

చిత్తూరు, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:
రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ శుక్రవారం బంగారుపాళ్యంలో పర్యటించనున్నారు. మంత్రి నారా లోకేష్ బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్ ప్రారంభించడంతో పాటు బంగారుపాళ్యంలో జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో పాల్గొననున్నారు. మంత్రి నారా లోకేష్ గురువారం ఉదయం 10.30 గంటలకు ఉండవల్లిలోని తన నివాసం నుండి బయలుదేరి విజయవాడ విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుండి ఉదయం 11.10 గంటలకు విమానంలో బయలుదేని మధ్యాహ్నం 12.10 గంటలకు తిరుపతి విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడి నుండి బంగారుపాళ్యంకు బయలుదేరి ఆయన సాయంత్రం 5 గంటలకు చేరుకుని రాత్రి అక్కడే బస చేస్తారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు బంగారుపాళ్యం ప్రభుత్వ ఆసుపత్రిలో కిడ్నీ డయాలసిస్ సెంటర్‌ను ప్రారంభిస్తారు. బంగారుపాళ్యంలో ఉదయం 11.30 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే ప్రజావేదిక కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్ ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారు. మధ్యాహ్నం 2 గంటలకు మంత్రి నారా లోకేష్ బంగారుపాళ్యం నుండి బయలుదేరి సాయంత్రం 3.30 గంటలకు తిరుపతి చేరుకుని అక్కడి నుండి విజయవాడ బయలుదేరి వెళ్తారు.

## త్వరితంగా పిఎం అవాస్ యోజన ఇళ్ళ నిర్మాణాలు పూర్తి

**- ఉపాధి నిధులు వెచ్చించి నిర్మాణాలు వేగవంతం**

**- హౌసింగ్ అధికారులతో కలెక్టర్ సుమిత్‌కుమార్**



చిత్తూరు, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త:
ప్రధానమంత్రి అవాస్ యోజన పథకం ఇళ్ళను త్వరితంగా పూర్తి చేయడానికి పక్కాగా చర్యలు చేపట్టాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ హౌసింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుండి బుధవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ హౌసింగ్ పిడి పద్మనాభంతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పిఎం అవాస్ యోజన పథకం కింద జిల్లాకు కేటాయించబడ్డ ఇళ్ళ పురోగతిపై మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు, హౌసింగ్ ఇఇ, డిఇ, ఎఇలతో సమీక్షించారు. ఈ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఈ నెల 28వ తేదీన మన ఇల్లు – మన గౌరవం పేరిట వివిధ దశల్లో అసంపూర్ణంగా వున్న ఇళ్ళ నిర్మాణాల పూర్తికి చర్యలు చేపడుతూ కార్యక్రమం ప్రారంభించనుందన్నారు. ప్రతి ఇంటి నిర్మాణం పూర్తికి ఉపాధి హామీ పథకం కింద 90 రోజుల పని దినాలు కేటాయించడం జరిగిందని, దీనిని వినియోగించుకుని ఇళ్ళ నిర్మాణాలను త్వరితంగా పూర్తి చేయాలన్నారు. జిల్లాకు 77,366 ఇళ్ళ నిర్మాణాలు మంజూరు అయ్యాయని అందులో 47,234 ఇళ్ళ నిర్మాణాలు పూర్తి అయ్యాయన్నారు. వివిధ దశల్లో నిర్మాణాలు పూర్తయిన వాటి బిల్లులను సత్వరం అప్‌లోడ్ చేయాలన్నారు. మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు హౌసింగ్ లేఅవుట్లలో పర్యటించి లబ్దిదారులతో మాట్లాడి అసంపూర్తిగా వున్న ఇళ్ళ నిర్మాణాలు పూర్తి చేయడంపై దృష్టి కేంద్రీకరించాలన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు సంబంధించి లబ్దిదారులకు ఆర్థికపరమైన ఇబ్బందులు వుంటే స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు మంజూరు చేయాలన్నారు.

## జానపద వృత్తి కళాకారులను ప్రోత్సహించండి

**బిజేపి నాయకులు నవీన్ కుమార్**

తిరుపతి హెల్త్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త
తిరుమలకు వచ్చే భజన భక్తి బృందాలకు దర్శనం మంచి వసతి ఉచిత లడ్డూ అల్పాహారం వారి స్వగ్రామాల నుంచి రాను పోను బస్సు చార్జీలను ఆన్‌లైన్ పేమెంట్స్ ద్వారా పారదర్శకంగా చెల్లించేలా ఏర్పాటు చేయండని బిజేపి నాయకులు నవీన్ కుమార్ రెడ్డి అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఈవో అడిషనల్ ఈవోకి బిజేపి నేత నవీన్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. టిడిపి ధర్మ ప్రచార పరిషత్‌కు రెగ్యులర్ కార్యదర్శి లేకపోవడంతో జానపద కళాకారుల సమస్యలపై డిప్యుటేషన్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. తిరుపతిలో అలిరిపి వద్ద పౌర్ణమి గరుడ సేవను పురస్కరించుకుని బుధవారం పులి మామిడి యాదగిరి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ఆధ్వర్యంలో జరిగిన అన్నదాన కార్యక్రమంలో కోలాటాల భజన కార్యక్రమంలో బిజేపి నేత నవీన్ కుమార్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. జానపద కళాకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై త్వరలో అధ్యక్షులు యాదగిరితో కలిసి టిటిడి ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు తనవంతు కృషి చేస్తానని నవీన్ తెలిపారు.



## సిఎం సహాయనిధికి నారాయణ విద్యార్థుల భారీ విరాళం

తిరుపతి విద్య,సెప్టెంబర్ 18,ప్రభాతవార్త:



ఉమ్మడి చిత్తూరు జిల్లా నారాయణ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థులు విజయవాడ వరద బాధితులకు సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇరవై ఏడు లక్షల ఒక వెయ్యి ఏడు వందల అరవై రూపాయల భారీ విరాళాన్ని డి.జి.ఎం కొండల రావు ఆధ్వర్యంలో తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్.ఎస్.వెంకటేశ్వర్ కు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు సేవా దృకపథంతో కష్టంలో ఉన్న వారిని ఆదుకోవాలనే సంకల్పంతో తమ తల్లిదండ్రుల వద్ద నుండే కాక, ఇతరుల నుండి కూడా చందాలు సేకరించి, ఇంత పెద్ద మొత్తాన్ని విరాళంగా ఇవ్వడం చాలా గొప్ప విషయమని పేర్కొంటూ విద్యార్థులను, వారిలో స్ఫూర్తి కలిగించిన అధ్యాపకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డీన్లు, ఏ.జి.యం.లు, ప్రిన్సిపాల్స్ లు పాల్గొన్నారు.

## నగరంలోని దుకాణాల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

**సుమారు ఏడు లక్షలకు పైగా భారీ జరిమానాలు విధింపు**

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 18, ప్రభాతవార్త



నగరంలోని దుకాణాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు కలిగిన దుకాణాదారులకు సుమారు ఏడు లక్షలకు పైగా భారీ జరిమానాలు విధించిన్నట్లు నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య తెలిపారు. బుధవారం నగర పాలక సంస్థ సిబ్బందితో కలిసి స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించి నిషేధిత ప్లాస్టిక్ వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వినియోగం ఎక్కువగా ఉన్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. ప్రధానంగా ఉన్న మూడు హోల్ సేల్ దుకాణాల్లో ఎక్కువగా నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు స్వాధీనం చేసుకుని, భారీగా జరిమానాలు విధించడం జరిగిందన్నారు. హోల్ సేల్ దుకాణాల నుండి తెచ్చి చిన్న చిన్న దుకాణంలో విక్రయిస్తున్నారని అన్నారు. 120 మైక్రాన్ల కంటే ఎక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లు, తదితర ప్లాస్టిక్ వస్తువులు వినిఓగించరాదన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు, ప్లాస్టిక్ ప్లేట్స్, స్పూన్స్, ప్యాకింగ్ కవర్స్, అమ్మితే దుకాణాల లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరించారు. బయో డిగ్రేడబుల్ కవర్లు అమ్మాలని దుకాణదారులకు సూచించారు. అధిక మొత్తంలో ప్లాస్టిక్ కవర్లు అమ్మే దుకాణాలపై లక్ష్యల్లో ఫైన్‌లు వేశామని చెప్పారు. ఒక దుకాణానికి 2.90 లక్షల రూపాయిల భారీ జరిమాన విధించామని అన్నారు. ప్రజలు కూడా పేపర్ కవర్స్, జ్యూట్ బ్యాగ్స్‌ను ప్రజలు ఎక్కువగా వినియోగించాలని కోరారు. ప్లాస్టిక్ రహిత నగరంగా తిరుపతిని తీర్చిదిద్దేందుకు అందరు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ తనిఖీల్లో హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి తదితరులు ఉన్నారు.

## టీడీపీలో భగ్గుమంటున్న వర్గ విబేధాలు

**టీడీపీ అధికారంలో వచ్చిన 100 రోజుల్లో మూడు గ్రూపులు**

విజయపురం, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:
మండలంలో టీడీపీలో వర్గ విబేధాలు భగ్గుమంటున్నాయని టీడీపీ నాయకులే పరోక్ష ఆరోపణలు చేస్తున్నారు. టీడీపీ అధికారంలో రావడం కోసం కృషి చేసిన నాయకులు తెర మరుగున పడి కొత్తగా పార్టీలో వచ్చిన వారు ఆధిపత్యం చెలాయించడంతో పార్టీలో వర్గపోరు మొదలైందని వారిని ఒక వర్గం స్వలాభం కోసం ఎక్కువగా ప్రోత్సహించడం వలన మండలంలో టీడీపీలో వర్గ విబేధాలు పుట్టుకుని వస్తున్నాయని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ కోసం నిత్యం కృషి చేసిన వారిని పక్కన పెట్టి కొత్తగా పార్టీ తీర్థం పుచ్చుకున్న వారు కార్యాకలాపాలు సాగించడం వలన, వారిని సమన్వయ పరిచే నాయకులు కొరవడడం వలన పార్టీకి దూరమవుతున్నారు. మండలంలో శాసన సభ ఎన్నికల తరువాత సీనియర్ లీడర్ల సమావేశాల్లో కనిపించడం కూడా లేదని, మండలంలో మూడు వర్గాలు పుట్టుకొచ్చాయని, ఈ విషయమై పార్టీ పెద్దలు చర్యలు తీసుకోవలసిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

## యువకుడిపై హత్యాయత్నం..

**అట్రాసిటీ కేసులో ఏడుమంది అరెస్ట్ - డిఎస్పీ**



కుప్పం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త
మద్యం మత్తులో ఓ యువకుడిపై హత్యాయత్నం చేసిన సంఘటనతో పాటు ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో ఏడుమందిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు కుప్పం డిఎస్పీ పార్థసారథి పేర్కొన్నారు. బుధవారం డిఎస్పీ కార్యాలయంలో అర్బన్ సిఐ జిటి నాయుడుతో కలసి ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక చవితి పండగ సందర్భంగా వినయ్ అనే యువకుడిపై పాతపేట మునస్వామిపురం ప్రాంతంలో కుప్పంకు చెందిన ఆర్‌వై బాలనాగరాజ్ (28) నేతృత్వంలో అతని సోదరులు శ్రావణ్ రాజ్ (22), శివసాయిరాజ్ (22), స్నేహితులు తరుణ్‌కుమార్ (23), ఆది (22'), ఉమాశంకర్ (22), జ్ఞానశేఖర్ (21), శ్రీవత్స అనే యువకులు పాతకక్షలు, రాడ్, కత్తితో దాడి చేశారన్నారు. ఈసంఘటనలో వినయ్‌కు తీవ్రగాయాలయ్యాయన్నారు. ఈఘటనలో బాలనాగరాజ్ ప్రధాన నిందితుడు అని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి 8మందిపై కేసు నమోదు చేసామన్నారు. బుధవారం కుప్పం రైల్వే స్టేషన్ వద్ద శ్రీవత్స మినహా మిగతా ఏడుమందిని అరెస్ట్ చేశామన్నారు. శ్రీవత్స పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. అలాగే మంగళవారం రాత్రి స్థానిక బాబునగర్‌లో ఇరు వర్గాల ఘర్షణ చోటు చేసుకుందని ఈసంఘటనలో 19మందిపై కేసు నమోదు చేశామన్నారు. హత్యాయత్నం, ఘర్షణ కేసుల్లో ఉన్న వారిపై రౌడీషీట్లు తెరుస్తామని పేర్కొన్నారు. యువత కుప్పంలో ప్రశాంత వాతావరణానికి సహకరించాలని సినిమా తరహా ప్రవర్తనలకు దూరంగా ఉండాలని సూచించారు. కుప్పంలో శాంతిభద్రతలపై రాజీ పడే ప్రసక్తే లేదని పేర్కొన్నారు.

## సీఈఐఆర్‌పై ప్రత్యేక శిక్షణ

రేణిగుంట, సెప్టెంబరు 18 ప్రభాతవార్త:
తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ బ్యారెక్స్‌లో బుధవారం రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు సీఈఐఆర్(సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటి రిజిస్ట్రీ) పై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఇటు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, అటు జీఆర్పీ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు. వీరికి గుంతకల్ డివిజన్ ఎస్పీ కార్యాలయ ఐటీ కోర్ అధికారులు సమీర్, శ్రీహరి సీఈఐఆర్‌పై అవగాహన కల్పించారు. కాల్ డేటా చరిత్రను ఎలా పొందాలో తెలియజేశారు. పోర్టల్‌ను ఎలా బ్లాక్‌చేయాలి, ఎలా అన్‌లాక్ చేయాలి విసికరించారు. ఇటీవల మొబైల్ ఫోన్లు విపరీతంగా రైళ్ళలో దొంగతనాలు జరుగుతున్నాయని బాధితులకు సత్వరం న్యాయం చేకూర్చే విధంగా రైల్వే శాఖ ప్రత్యేకంగా ఈ వ్యవస్థను ప్రవేశపెట్టిందని తెలిపారు. కార్యక్రమంలో గుంతకల్ ఎస్ఆర్‌పీ రాహుల్ మీన, డీఎస్ఆర్‌పీ హర్షిత, గుంతకల్ డీఎస్పీ మురళీకృష్ణ, ఏఎస్పీ రాజగోపాల్‌రెడ్డి, తిరుపతి రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, రేణిగుంట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కుమార్, ఆర్పీఎఫ్, జీఆర్పీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## కలెక్టర్‌చే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం వాయిదా

కుప్పం, సెప్టెంబర్ 18 ప్రభాతవార్త
కుప్పం మండల కార్యాలయంలో గురువారం జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధ్వర్యంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంను మరో వారానికి వాయిదా వేశారు. గురువారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు నూతన ఇసుక పాలసీలో భాగంగా నూతన వెబ్‌సైట్‌ను వర్చువల్ విధానంలో ప్రారంభించడంతో పాటు కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీడియో కాన్ఫరెన్స్ కార్యక్రమం ఉండడంతో కార్యక్రమాన్ని తాత్కాలికంగా మార్పు చేసినట్లు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ తెలిపారు.

## ఉత్సవాల్లో కొరవడిన జవాబుదారి తనం : అపశృతులు

**మాజీ చైర్మెన్ ధ్వజం**



శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 18 ప్రభాతవార్త
శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో అధికారుల జవాబుదారి తనం కొరవడిందని దాంతో అపశృతులు చోటు చేసుకుంటున్నాయని మాజీ ధర్మకర్తల మండలి చైర్మెన్ అంజూరు తారక శ్రీనివాసులు బుధవారం ధ్వజమెత్తారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఐదు రోజుల పాటు నిర్వహించిన 'పవిత్రోత్సవాల్లో' ప్రతి రోజూ ఏదో ఒక తప్పిదం చోటు చేసుకుందన్నారు. ఇందుకు నిదర్శనమే మంగళవారం రాత్రి గ్రామోత్సవంలో చోటు చేసుకున్న సంఘటన అని ఆయన వివరించారు. అధికారుల అలసత్వం భక్తులను మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయన్నారు. ఇది పవిత్ర పుణ్యక్షేత్రానికి ఇది మంచిది కాదన్నారు. ఉత్సవాల్లో అధికారుల నిర్లక్ష్యంతో అపశృతులు చోటు చేసుకున్నా వాటిని అధికారులు సరిదిద్దే ప్రయత్నం చేయకపోవటం శోచనీయం అన్నారు. పవిత్రోత్సవాలంటే మూలవిరాట్లు శక్తిని పురేకీకరణ చేయటానికి నిర్వహించే పూజలన్నారు. దేవస్థానం అధికారుల నిర్లక్ష్యంతో పవిత్ర దెబ్బతింటుందని ఆరోపించారు. తాను చైర్మెన్‌గా ఉన్నపుడు ఉత్సవాలలో తాను జాగ్రత్తలు తీసుకునేవారమన్నారు. మొదటి రోజు శ్రీ–కాళ–హస్తి, భరద్వాజమహర్షి గ్రామోత్సవం సందర్భంగా పట్టణంలోని రోడ్లపై నీళ్ళు చల్లకపోవటంతో పుణ్యావచనం చేయక పోవటం, ఉత్సవాన్నితీసుకెళ్ళటానికి అడ్డంకులు ఉంటే వాటిని సరిచేయకపోవటంతో వాహనాన్ని మోసే శ్రీపాదకూలీలు ఎండలకు కాళ్ళు బొబ్బలుఎక్కి పరుగులు తీసాయన్నారు. మూడో రోజు ఉత్సవ నిర్వహణ సమయంలోబేరివారి మండపం వద్ద అన్నదానం జరుగుతుంటే దానికి ముందస్తు తగినేర్పాటు చేసుకొని ఉత్సవానికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా తీసుకెళ్ళాల్సి ఉండగా అ లా చేయకపోవటంతో నానా అవస్థలను పడి ఉత్సవమూర్తులను తీసుకెళ్ళటం బాధాకరమన్నారు. మంగళవారం రాత్రి ఉత్సవం రాత్రి 12గంటలకుచేరుకోవటం గమనిస్తే ఉద్యోగుల బాధ్యతారాహిత్యాన్ని చాటుతుందన్నారు. ఇలాంటి ఘటనలు పవిత్ర పుణ్యక్షేత్రానికి మంచిది కాదన్నారు. దీన్నివెంటనే 'సంప్రోక్షణ' చేయాల్సి ఉండక చేయక పోవటం బాధాకరమన్నారు. దేవస్థానం ఉన్నతాధికారులు ఇంజనీరింగ్ అధికారులు పర్యవేక్షణ కొరవడంతో అపశృతులు చోటు చేసుకుంటున్నా యని అంజూరు తారక శ్రీనివాసులు ధ్వజమెత్తారు.

# ఆరునెలల్లో మాజీ ఎంఎల్‌ఏ అరెస్టు తథ్యం

**-అక్రమాలపై విచారణ జరుపుతాం:**

**నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తా..**



శ్రీకాళహస్తి రూరల్,సెప్టెంబర్ 18 ప్రభాతవార్త
శ్రీకాళహస్తి నియోజకవర్గంను ఐదేళ్ళ పాటు పరిపాలించిన శాసనసభ్యుడు బియ్యపు మధుసూధనరెడ్డి అక్రమాలపై, ఆక్రమణలపై సమగ్ర విచారణ జరిపి ఆరునెలల్లో ఆయన్ను జైలులో పెట్టడం ఖాయమని శాసనసభ్యుడు బొజ్జల సుదీర్‌రెడ్డి అన్నారు. నియోజక వర్గాన్ని ప్రధాని మంత్రి నరంద్రమోడి, ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రాష్ట్రాన్ని 100 రోజుల్లో ఎలా అభివృద్ధి పథంలో నడినట్లే శ్రీకాళహస్తి నియోజక వర్గాన్ని అబివృద్ధి పథంలో నడుపుతున్నానని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్‌రెడ్డి బుధవారం విలేకరుల సమావేశంలో అన్నారు. సుమారు 10 కోట్ల రూపాయిల పనులు వివిధ దశల్లో జరుగుతున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో 25 వేల రాహుకేతు పూజలు జరిగేలా చేయడమే తన లక్ష్యమని మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని పేర్కొన్నారు. తన తండ్రి మానసిక పుత్రికైన స్కిట్ కళాశాలను ఆరు నెలలో జెఎన్‌టియూలో విలినం చేయనున్నట్లు ప్రకటించారు. గత 100 రోజుల్లో నియోజక వర్గంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, 5 ఏళ్లలో చేయనున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి పలు లక్ష్యాలను నిర్ణయించారు. తాము అధికారంలో రాగానే మంత్రులు నారాయణ, నారాలోకేష్ సహకారంతో మున్సిపాలిటికి 50 లక్షలు మంజూరు చేయించి డ్రైనేజిలు షీటు తొలగింపు పనులు చేసి వరద ముప్పు లేకుండా చేశారు. గ్రామాల్లో తాగునీటి కొరకు 48 బోర్లు వేయించామన్నారు. అంధకారంలో ఉన్న గ్రామాలలో 100 వీధి లైట్లు వేయించామన్నారు. ప్రతి పంచాయితీలో శానిటేషన్ వర్కు చేయిస్తూ వాటి పర్యవేక్షలకు వినూతంగా వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేసి పరిశీలిస్తున్నామన్నారు. అలాగే నాలుగుమాఢవీధుల్లో రాజకీయ బ్యానర్లు నిషేధించామన్నారు.

**ఆలయ ఆదాయం పెంపు..**

శ్రీకాళహస్తీశ్వరాలయంలో 100 రోజుల్లో పెనుమార్పులు చేసి బ్రోకర్ల ఆగడాలను కట్టడి చేశామన్నారు. ఆలయ ఆదాయం 100 రోజులు 4 కోట్లు వచ్చేలలా చేశామన్నారు. రానున్న రోజుల్లో శ్రీకాళహస్తీశ్వరాలయంలో 25 వేల నుంచి 30 వేలు జరిగేలా చేయడమే లక్ష్యమన్నారు. తన తండ్రి స్వర్గీయ బొజ్జల.గోపాలకృష్ణారెడ్డి మానసిక పుత్రికైన స్కిట్ కళాశాలలు జెఎన్‌టియూల్లో విలినం చేసేలా జిఓ తీసుకొస్తున్నట్లు మరో ఆరు నెలలో విలినం ప్రక్రియ జరుగుతోందన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖమంత్రి నారా లోకేష్ ఎంతో ఉందన్నారు. మాజీ ఎంఎల్ఏ మధుసూదన్‌రెడ్డి ఆక్రమాల పై విచారణకు ఈడి, ఐటి శాఖలను కోరుతున్నట్లు తెలిపారు.